ప్రజా
రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 01 సంచిక -323 పేజీలు - 08 వెల - 06/- మంగళవారం 25 ఫిబ్రవరి 2025

ఐటి నుంచి ఏఐ దాకా ఏపి దూసుకెళ్తోంది

బడ్జెట్ సమావేశాల్లో ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం

- ఐటి నుంచి ఎఐ రివల్యూషన్ దిశగా అడుగులు
- రూ. 6.5 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం
- గత ఐదేళ్ల పాలనలో అన్నీ అధ్వాన్న పరిస్థితులు
- రాష్ట్రాన్ని గాడిలో పెట్టే ప్రయత్నాలు ముమ్మరం చేశాం
- విశాఖ సటీల్ ప్రైవేటీకరణను నిలువరించాం
- పెనషన్లను నాలుగువేలకు పెంచి ఠంచన్‌గా ఇస్తున్నాం
- సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు మేలు
- మధ్యలోనే నిష్క్రమించిన జగన్,వైకాపా సభ్యులు

2లో

ఏపీలో 5, తెలంగాణలో 5 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు...

షెడ్యూల్ విడుదల

ఏపీ తెలంగాణల్లో వచ్చే నెలలో ఖాళీ కానున్న 10 ఎమ్మెల్సీ స్థానాలు

ఏపీలో 5, తెలంగాణలో 5 స్థానాలకు మార్చి 3న నోటిఫికేషన్ విడుదల

మార్చి 20న ఎన్నికలు... అదే రోజున లెక్కింపు



2లో

భారత్ మాటలే కాదు.. చేతల్లో చూపిస్తున్నాం

వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న దేశం

ప్రపంచ బ్యాంక్ వ్యాఖ్యలను గుర్తు చేసిన ప్రధాని

గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో ప్రధాని మోడీ

భోపాల్,ఫిబ్రవరి 24, (రిపబ్లిక్ న్యూస్): భారత్ మాటలకే పరిమితం కావడం లేదని, చేతల్లోను చూపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. భారత్ ఆర్థికరంగంలో వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా కొనసాగు తోందని ప్రపంచ బ్యాంకు చెప్పిందని గుర్తుచేశారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోమిగతాది 2లో...

రెస్క్యూ కోసం 'ర్యాట్ మైనర్స్'

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు.

డ్రోన్లు, ఎండోస్కోపిక్ కెమెరాలు, తో సొరంగంలోకి వెళ్లిన రెస్క్యూ సిబ్బంది

సొరంగంలో నిలిచిన బురద, నీళ్లను తొలగించే ప్రయత్నం

ఢిల్లీ నుండి వచ్చిన ర్యాట్ మైనర్స్

ఫిబ్రవరి 24, (రిపబ్లిక్ న్యూస్): ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈరోజు మధ్యాహ్నం డ్రోన్లు, ఎండోస్కోపిక్ కెమెరాలు, వాకీటాకీ వంటి సిగ్నల్ పరికరాలతో సహాయక సిబ్బంది సొరంగం లోనికి వెళ్లింది. సొరంగంలో సుమారు 200 మీటర్ల మేర బురద పేరుకుపోయింది. బురదతో పాటు నీళ్లు నిలిచి ఉండటంతో బృందాలు ముందుకు వెళ్లలేకపోతున్నాయి.మిగతాది 2లో...

ఫైబర్ నెట్ చైర్మన్ పదవికి జీవీ రెడ్డి రాజీనామా...

ఆమోదించిన చంద్రబాబు ప్రభుత్వం

ఏపీ రాజకీయాల్లో కీలక పరిణామం

ఫైబర్ నెట్ వివాదంపై నివేదిక

చంద్రబాబు వద్దకు చేరిక

వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నానన్న జీవీ రెడ్డి

టీడీపీ కూడా రాజీనామా

అటు, ఫైబర్ నెట్ ఎండీ దినేశ్ కుమార్ బదిలీ

2లో

మాకు ప్రతిపక్ష హెూదా ఇవ్వాల్సిందే

: అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసిన తర్వాత మీడియాతో బొత్స

ప్రజల గొంతుకను వినిపించేది ప్రతిపక్షమేనన్న బొత్స

రైతు సమస్యలపై ప్రభుత్వం నుంచి స్పందన లేదని విమర్శ

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాక్షేత్రంలోకి వెళతామని వ్యాఖ్య

2లో

రాష్ట్ర గవర్నర్ కి స్వాగతం పలికిన నంద్యాల జిల్లా ఇన్చార్జ్ ఎస్పీ విక్రాంత్ పాటిల్

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 24, (రిపబ్లిక్ న్యూస్): జిల్లా పరిధలోని శ్రీశైలంలో జరుగుచున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శ్రీశైల భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి వారిని దర్శించుకునేందుకు విచ్చేశారు. శ్రీశైలం సున్నిపెంట హెలిప్యాడ్ నందు రాష్ట్ర గవర్నర్ కి జిల్లా ఎస్పీ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

పీఎం కిసాన్ నిధులు విడుదల చేసిన ప్రధాని

అమరావతి ఫిబ్రవరి 24, (రిపబ్లిక్ న్యూస్):

ఒక్కో రైతుకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.6 వేలు

రైతులకు పెట్టుబడి సాయం కింద కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం-కిసాన్ నిధులు సోమవారం జమ అయ్యాయి. పీఎం కిసాన్ యోజన కింద 19వ విడత నిధులను ఈరోజు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విడుదల చేశారు. బీహార్‌లోని భాగల్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో భాగంగా రూ.22 వేల కోట్లకు పైగా నిధులను విడుదల చేశారు. ఈ నిధులతో 9.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. పీఎం కిసాన్ పథకం కింద ఒక్కో విడత రూ.2 వేల చొప్పున ఏడాదికి మూడు విడతలు మొత్తం రూ.6 వేలు రైతుల ఖాతాల్లో జమ అవుతాయి.

ఫిక్స్ అయిపోండి...

ఈ ఐదేళ్లలో మీకు ప్రతిపక్ష హెూదా రాదు

: వైసీపీపై పవన్ ఘాటు వ్యాఖ్యలు

జనసేనకు వచ్చినన్ని సీట్లు కూడా వైసీపీకి రాలేదని పవన్ ఎద్దేవా

ప్రతిపక్ష హెూదాను ప్రజలు ఇస్తారని వ్యాఖ్య

రాష్ట్రంలో రెండో అతిపెద్ద పార్టీ జనసేన అన్న పవన్

అమరావతి ఫిబ్రవరి 24, (రిపబ్లిక్ న్యూస్): వైసీపీని ప్రతిపక్షంగా గుర్తించాలంటూ ఏపీ బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం సమయంలో వైసీపీ సభ్యులు నినాదాలు చేసిన సంగతి తెలిసిందే.మిగతాది 2లో...

ఐటి నుంచి ఎఐ దాకా ఏపి దూసుకెళ్తోంది

అమరావతి ఫిబ్రవరి 24, (రిపబ్లిక్ న్యూస్):

సంక్షేమం, అభివృద్ధి సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని ఎపి గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ ఉభయసభలను ఉద్దేశించి అన్నారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర కల సాకారం దిశగా అడుగులు వేస్తున్నట్టు చెప్పారు. 'పెన్షన్లు రూ. 4 వేలకు పెంచాం. ఏడాదికి రూ. 3 సిలిండర్లు ఫ్రీగా ఇస్తున్నాం. పోలవరంను పట్టాలెక్కించాం. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగింది. ఐటీ నుంచి ఏఐ రివల్యూషన్ దిశగా అడుగులు వేస్తున్నాం. ప్రజలు కోరిక మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. గత ఐదేళ్లలో రాష్ట్రం అనేక ఇబ్బందులకు గురైంది. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ఎంతో నష్టపోయింది. మా ప్రభుత్వం వచ్చాక తలసరి ఆదాయం పెరిగింది. రూ. 6.5 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు మేలు చేస్తున్నాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం' అని గవర్నర్ తెలిపారు. సోమవారం ఉదయం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ జస్టిస్ నజీర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..అన్న క్యాంటీన్లతో పేదల ఆకలి తీరిస్తున్నామని.. విద్య, వైద్య రంగాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించమని గవర్నర్ అన్నారు. 2029 నాటికి ప్రతి పేద కుటుంబానికి ఇల్లు సమకూరేలా చూస్తామన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి ప్రోత్సాహిస్తున్నాం. పీఎం సూర్య ఘర్ యోజన కింద.. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మరోవైపు ఏపీ అసెంబ్లీ సమావేశాలు హాట్‌హాట్‌గానే ప్రారంభ మయ్యాయి. గవర్నర్ ప్రసంగంపై నిరసనలకు దిగారు వైసీపీ సభ్యులు. తమకు అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ వైసీపీ డిమాండ్ చేసింది. వైసీపీ అధినేత జగన్ సహా అందరూ గవర్నర్ ప్రసంగానికి నిరసన తెలిపారు. కొద్దిసేపు నినాదాలు చేసిన అనంతరం సభ్యులంతా వాకౌట్ చేశారు. ఎన్నికల్లో ప్రజలు మా ప్రభుత్వానికి తిరుగులేని మెజారిటీ ఇచ్చారు. ప్రజల కోరిక మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. గత ఐదేళ్లలో రాష్ట్రం అనేక ఇబ్బందులకు గురైంది. గత ప్రభుత్వ పాలనతో రాష్ట్రం ఎంతో నష్టపోయింది. సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు మేలు చేస్తున్నాం. అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం. మెగా డీఎస్సీ దస్త్రంపై సంతకం చేశాం. అన్న క్యాంటీన్‌లు తెచ్చి పేదవాళ్ల ఆకలి తీరుస్తున్నాం.కూటమి వచ్చాక రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం. మా ప్రభుత్వం వచ్చాక తలసరి ఆదాయం పెరిగింది. అవకాశాలిస్తే ప్రతి ఒక్కరూ మెరుగైన సేవలు అందిస్తారని నమ్ముతున్నాం. ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటికి వెళ్లి పింఛన్లు అందిస్తున్నాం. పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నాం. విద్య, వైద్యం, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాం. 2047 నాటికి స్వర్ణాంధ్ర కలను సాకారం చేస్తాం. బీసీ వర్గాలు సమాజానికి వెన్నెముక. వారికోసం ప్రత్యేక కార్యక్రమాలు. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు అనేక పథకాలు ప్రవేశపెట్టాం. అర్హులైన అందరికీ సొంతిల్లు ఉండాలనేదే మా ఆకాంక్ష అని తెలిపారు. గవర్నర్ ప్రసంగిస్తూ కందుకూరి వ్యాఖ్యలను ప్రస్తావించారు. ప్రతి వ్యక్తిలో ప్రతిభ ఉంటుంది. అవకాశమిస్తే బయటకు వస్తుంది. సమాజ అభివృద్ధికి సంక్షేమం, అభివృద్ధి కలిసి కట్టుగా వెళ్లాలి. మా ప్రభుత్వం గత ఎనిమిది నెలల్లోనే గణనీయమైన పురోగతి సాధించింది. 22 కొత్త విధానాల ద్వారా సుస్థిర

వృద్ధికి బాటలు వేశాం. పోలవరం, అమరావతి మళ్లీ పట్టాలెక్కించాం. విశాఖ ఉక్కు పరిరక్షణ, రైల్వే జోన్ ఏర్పాటు హామీలు నెరవేర్చాం. గూగుల్, ఆర్సెలర్ మిట్టల్, టాటా పవర్, గ్రీన్ కో గ్రూప్, బీపీసీఎల్, టీసీఎస్ కంపెనీలకు ఆకర్షించాం. ఇన్వెస్టర్లు ఇప్పటి వరకు రూ. 6.5 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టారు. ఆయా పెట్టుబడుల ద్వారా 4 లక్షల మందికి ఉపాధి అవకాశాలు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ రూ. 16 లక్షల కోట్లకు విస్తరించింది. తలసరి ఆదాయం కూడా రూ. 2.68 లక్షలకు పెరిగింది. రాష్ట్రంలో ఐటీ విప్లవానికి సీఎం శ్రీకారం చుట్టాం. అమెరికాలోని ప్రవాస తెలుగువాళ్ల తలసరి ఆదాయం ఎక్కువ. ప్రస్తుతం ఏపీ మరో విప్లవానికి నాయకత్వం వహిస్తోంది. పరిపాలన, పరిశ్రమలు, ఆర్థిక వృద్ధిలో ఏఐను వినియోగిస్తున్నాం. పీపుల్ ఫస్ట్ విధానంతో స్వర్ణాంధ్ర సాధనకు సమగ్ర రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేశాం. దేశంలోనే తొలిసారిగా మెగా పేరెంట్ – టీచర్ మీటింగ్ నిర్వహించాం. తల్లులకు చేయూత నిస్తూ 'తల్లికి వందనం' అమలు చేయబోతున్నామని గవర్నర్ వెల్లడించారు. సమావేశాలు ప్రారంభమైన 11 నిమిషాలకే ఇక చాల్లే పోదం పదండి అన్నట్లు వైకాపా సభ్యులతో కలిసి జగన్ బయటకు వచ్చేశారు. గవర్నర్ ప్రసంగం సాగుతుండగా సభలో గందరగోళం సృష్టించేందుకు వైసీపీ సభ్యులు యత్నించారు.

మాకు ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సిందే

: అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసిన తర్వాత మీడియాతో బొత్స

అమరావతి ఫిబ్రవరి 24, (రిపబ్లిక్ న్యూస్):ఏపీ బడ్జెట్ సమావేశాల నుంచి వైసీపీ వాకౌట్ చేసింది. గవర్నర్ ప్రసంగాన్ని బహిష్కరిస్తూ వైసీపీ అధినేత జగన్ సహా ఆ పార్టీ సభ్యులందరూ సభ నుంచి బయటకు వచ్చేశారు. అనంతరం జగన్ తన వాహనంలో అక్కడి నుంచి వెళ్లిపోగా... అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ... వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని సభలో నినదించామని చెప్పారు. సభలో ఉన్నది రెండే పక్షాలని... ఒకటి అధికారపక్షమైన కూటమి, రెండోది ప్రతిపక్షమని చెప్పారు. ప్రజల గొంతుకను సభలో

వినిపించేది ప్రతిపక్షమేనని, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి ఎంతో విలువ ఉంటుందని, అందుకే తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. రైతుల సమస్యలపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేదని... కేంద్రంతో మాట్లాడుతున్నామని, సమస్యలను తీర్చేందుకు ప్రయత్నం చేస్తున్నామని మాత్రమే చెపుతున్నారని బొత్స విమర్శించారు. అందుకే ప్రజలు, రైతుల కష్టాలు చెప్పేందుకు తాము ప్రతిపక్ష హోదా అడుగుతున్నామని వివరించారు.

రైతుల సమస్యలపై పోరాడుతున్న తమపై కేసులు పెడుతున్నారని బొత్స మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచినా సూపర్ సిక్స్ హామీలపై ఎలాంటి చర్యలు లేవని విమర్శించారు. ప్రతిపక్ష హోదాపై ప్రభుత్వ స్పందన చూసిన తర్వాతే తమ తదుపరి చర్య ఉంటుందని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజాక్షేత్రంలోకి వెళతామని, ప్రభుత్వ చొక్కా పట్టుకుంటామని తెలిపారు.

ఫిక్స్ అయిపోండి...

(మొదటి పేజి తరువాయి)

దాదాపు 11 నిమిషాల పాటు గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేసిన వైసీపీ సభ్యులు... ఆ తర్వాత సభ నుంచి వాకౌట్ చేశారు. వైసీపీ డిమాండ్ పై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.ప్రతిపక్ష హోదా అనేది ముఖ్యమంత్రి, స్పీకర్ ఇస్తే తీసుకునేది కాదని... ఆ హోదాను ప్రజలు ఇస్తారని పవన్ చెప్పారు. వైసీపీకి ప్రజలు కేవలం 11 సీట్లను మాత్రమే ఇచ్చారని... రాష్ట్రంలో రెండో అతిపెద్ద పార్టీ జనసేన అని... జనసేనకు వచ్చినన్ని సీట్లు కూడా వైసీపీకి రాలేదని ఎద్దేవా చేశారు. వైసీపీకి ప్రతిపక్ష హోదా రాదని చెప్పారు. జనసేన కంటే ఒక్క సీటు ఎక్కువ వచ్చి ఉన్నా ప్రతిపక్ష హోదా ఇచ్చేవాళ్లమని తెలిపారు. ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే సభను అడ్డుకుంటామంటే కుదరదని పవన్ అన్నారు. సభకు వచ్చిన వెంటనే ఆందోళన చేయడం వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. ఈ ఐదేళ్లలో మీకు ప్రతిపక్ష హోదా రాదు... ఫిక్స్ అయిపోండని అన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వడానికి నిబంధనలు ఉన్నాయని అన్నారు. జ్వరంతో బాధపడుతున్నప్పటికీ అసెంబ్లీకి వచ్చిన గవర్నర్ రెండు గంటల సేపు ప్రసంగించారని... ఆయన ప్రసంగాన్ని అడ్డుకుకోవడానికి వైసీపీ యత్నించడం దారుణమని అన్నారు. వైసీపీ నేతలు హుందాగా వ్యవహరించడం నేర్చుకోవాలని చెప్పారు. ప్రజలు ఇచ్చిన 11 సీట్లను గౌరవించి సభకు రావాలని... మీకు వచ్చిన సీట్లకు అనుగుణంగా సభలో మాట్లాడేందుకు స్పీకర్ సమయాన్ని కేటాయిస్తారని అన్నారు.

భారత్ మాటలే కాదు..చేతల్లో చూపిస్తున్నాం

(మొదటి పేజి తరువాయి)

జరుగుతోన్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో సోమవారం మాట్లాడిన ఆయన.. సదస్సులో పాల్గొన్న వారికి క్షమాపణలు తెలియజేశారు. తాను ఆలస్యంగా రావడానికి గల కారణాన్ని చెప్పారు. 10,12 తరగతి విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నాయి. ఈ పరీక్ష ప్రారంభమయ్యే సమయం.. నేను రాజ్‌భవన్ నుంచి బయల్దేరే సమయం ఒకటే. అప్పుడు నేను వస్తే భద్రతా కారణాల దృష్ట్యా ట్రాఫిక్ జామ్ కావొచ్చు. దాంతో విద్యార్థులు ఇబ్బందిపడే అవకాశం ఉంది. అందుకే వారంతా పరీక్షా కేంద్రాలకు వెళ్లిన తర్వాత రాజ్‌భవన్ నుంచి బయల్దేరాలనుకున్నాను. దాంతో 15-20 నిమిషాలు ఆలస్యమైంది. ఇక్కడ మీకు అసౌకర్యం కలిగించినందుకు క్షమాపణలు కోరుతున్నానని మోదీ మాట్లాడారు. భారత ఆర్థిక వ్యవస్థపై ప్రపంచం ఆశాభావంతో ఉందని మోదీ అన్నారు. జనాభాపరంగా మధ్యప్రదేశ్ ఐదో అతిపెద్ద రాష్ట్రం. వ్యవసాయం, ఖనిజాల పరంగా ముందువరుసలో ఉంది. రెండు దశాబ్దాలుగా ఈ రాష్ట్రంలో ఎన్నో మార్పులు సంభవించాయి. ఇక్కడ భాజపా నేతృత్వంలోని ప్రభుత్వం సుపరిపాలనపై దృష్టిసారించింది. 20 సంవత్సరాలకు ముందు ఇక్కడికి రావాలంటే పెట్టుబడిదారులు ఆలోచించేవారు. కానీ ఇప్పుడు పెట్టుబడుల పరంగా ముందువరుసలో ఉంది. అలాగే సౌరశక్తిలో భారత్ సూపర్ పవర్‌గా మారిందని ఐక్యరాజ్యసమితికి చెందిన ఓ విభాగం కీర్తించింది. ఇతర దేశాలు మాటలతో ఆగిపోతుంటే.. భారత్ చెప్పింది చేసి చూపించిందని ఆ సంస్థే పేర్కొంది. ఈ వ్యాఖ్యలు పెట్టుబడిదారుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తున్నాయని ప్రధాని పేర్కొన్నారు. మంగళవారం కూడా ఈ సమ్మిట్ జరగనుంది. దీనికి 60 దేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, ఆయా దేశాల దౌత్యవేత్తలు పాల్గొన్నారు. భారత వ్యాపారరంగ ప్రముఖులు కుమార్ మంగళంబిర్లా, గౌతమ్ అదానీ, నాదిర్ గోద్రెజ్ తదితరులు హాజరయ్యారు.

ఏపీలో 5, తెలంగాణలో 5 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు...

,అమరావతి ఫిబ్రవరి 24, (రిపబ్లిక్ న్యూస్):ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో త్వరలో మొత్తం 10 ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. దాంతో, ఏపీలో ఐదు, తెలంగాణలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు నేడు షెడ్యూల్ విడుదలైంది. ఏపీలో ఐదుగురు ఎమ్మెల్సీల పదవీకాలం మార్చి 29తో ముగియనుంది. యనమల రామకృష్ణుడు, జంగా కృష్ణమూర్తి, డి.రామారావు, పి. అశోక్ బాబు, తిరుమలనాయుడు పదవీకాలం వచ్చే నెలతో ముగియనుంది. తెలంగాణలో సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ, మీర్జా రియాజుల్ హసన్, శేరి సుభాష్ రెడ్డి, ఎగ్గె మల్లేశంల పదవీకాలం కూడా వచ్చే నెలతో ముగియనుంది. ఈ నేపథ్యంలో, ఆయా ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు మార్చి 3న నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. మార్చి 10 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. మార్చి 11న నామినేషన్ల పరిశీలన చేపడతారు. నామినేషన్ల ఉపసంహరణకు మార్చి 13 వరకు గడువు ఇచ్చారు. మార్చి 20న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఓట్ల లెక్కింపు కూడా మార్చి 20న పోలింగ్ ముగిశాక సాయంత్రం 5 గంటల నుంచి చేపడతారు. కాగా, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు.

తొలి ప్రాధాన్యత ఓట్లతోనే

కూటమి అభ్యర్థులు గెలవాలి: నారా లోకేశ్

ఉండవల్లి నివాసంలో నారా లోకేశ్ సమీక్ష

ప్రచారానికి అతి తక్కువ సమయం ఉందని వెల్లడి

టెక్నాలజీ వాడుకుని ఓటరుకు చేరువ కావాలని సూచన

అమరావతి ఫిబ్రవరి 24, (రిపబ్లిక్ న్యూస్):ఉభయ గోదావరి, కృష్ణా-గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్యత ఓట్లతోనే కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో ఘన విజయం సాధించాలని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ సీనియర్ నేతలతో మంత్రి లోకేశ్ నేడు ఉండవల్లి నివాసంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రచారానికి అతి తక్కువ సమయం మాత్రమే ఉండటంతో టెక్నాలజీ వినియోగం ద్వారా ప్రతి ఓటరును అభ్యర్థించాలని అన్నారు. ఎన్నికల ముందు రోజు శివరాత్రి పండుగ నేపథ్యంలో ప్రతి ఓటరు పోలింగ్ బూత్ లకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకునేలా ఇన్ చార్జి మంత్రులు, శాసనసభ్యులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఎన్నికల రోజు పరిస్థితిని ఎప్పటికప్పుడు కేంద్ర కార్యాలయం నుంచి పర్యవేక్షించేందుకు వార్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కూటమి నాయకులంతా కలసికట్టుగా పార్టీ అభ్యర్థుల ఘన విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, వేపాడ చిరంజీవి, జోనల్ కోఆర్డినేటర్లు సుజయకృష్ణ రంగారావు, ఎం.వి సత్యనారాయణ రాజు, దామచర్ల సత్య, మండలపు రవి తదితరులు పాల్గొన్నారు.

వల్లభనేని వంశీపై ఆరోపణలు...

సిట్ ఏర్పాటు

వంశీ అక్రమాలకు పాల్పడ్డారంటున్న ప్రభుత్వం

వంశీ వల్ల ప్రభుత్వానికి రూ.195 కోట్ల నష్టం వాటిల్లిందంటున్న సర్కారు

నలుగురితో సిట్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు

జీవీజీ అశోక్ కుమార్ నేతృత్వంలో సిట్ నియామకం

అమరావతి ఫిబ్రవరి 24, (రిపబ్లిక్ న్యూస్):

గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి మరిన్ని ఇబ్బందులు తప్పేలా లేవు. ఆయనపై వచ్చిన ఆరోపణలను విచారించేందుకు కూటమి ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. జీవీజీ అశోక్ కుమార్ నేతృత్వంలోని ఈ సిట్ లో నలుగురు సభ్యులు ఉంటారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వంశీ అక్రమాల వల్ల రూ.195 కోట్ల నష్టం వచ్చిందని ప్రభుత్వం చెబుతోంది. వంశీపై అక్రమ మైనింగ్, భూకబ్జా ఆరోపణలు ఉన్నాయి. గన్నవరం టీడీపీ ఆఫీసు కంప్యూటర్ ఆపరేటర్ సత్యవర్ధన్ కిడ్నాప్ వ్యవహారంలో వల్లభనేని వంశీని పోలీసులు అరెస్ట్ చేయడం తెలిసిందే. ఆయన ప్రస్తుతం విజయవాడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. తాజాగా ఆయనను మూడు రోజుల పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ విజయవాడ ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది.

ఫైబర్ నెట్ చైర్మన్ పదవికి జీవీ రెడ్డి రాజీనామా...

అమరావతి ఫిబ్రవరి 24, (రిపబ్లిక్ న్యూస్):

ఏపీ రాజకీయాల్లో నేడు కీలక పరిణామం చోటుచేసుకుంది. ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ పదవికి జీవీ రెడ్డి రాజీనామా చేశారు. దాంతోపాటే టీడీపీ ప్రాథమిక సభ్యత్వానికి, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి హోదాకు కూడా రాజీనామా చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు రాజీనామా లేఖను పంపారు. ఫైబర్ నెట్ చైర్మన్ పదవికి జీవీ రెడ్డి చేసిన రాజీనామాను కూటమి ప్రభుత్వం ఆమోదించింది. మరోవైపు ఫైబర్ నెట్ లో వివాదంపై నివేదిక సీఎం వద్దకు చేరింది. ఫైబర్ నెట్ ఎండి దినేశ్ కుమార్ ను బదిలీ చేస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. దినేశ్ కుమార్ కు సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)కి రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఈ రెండు చర్యల ద్వారా... అటు పార్టీలో అయినా, ఇటు ప్రభుత్వంలో అయినా క్రమశిక్షణకు ప్రాధాన్యం అనే బలమైన సంకేతాలను పంపించినట్టయింది.

రెస్క్యూ కోసం 'ర్యాట్ మైనర్స్'

సొరంగంలో విరిగిన భాగాలు, బురదను బయటకు తీసుకువచ్చేందుకు సహాయక సిబ్బంది ప్రయత్నాలు చేస్తోంది. 2023లో ఉత్తరాఖండ్‌లో జరిగిన ప్రమాదంలో మద్రాస్ ఐఐటీ నిపుణుల బృందం 34 మందిని రక్షించింది. అత్యాధునిక టెక్నాలజీని కలిగిన ఆక్వా ఐ, ఫ్లెక్సీ ప్రోబ్ పరికరాలతో మద్రాస్ ఐఐటీ నిపుణులు సహాయక చర్యలు చేపడతారు. విశాఖకు చెందిన నేవీ బృందం కూడా రంగంలోకి దిగింది.మరోవైపు, ఉత్తర కాశీలో సిల్క్ యారా టన్నెల్‌లో చిక్కుకున్న 41 మందిని రక్షించిన స్పెషలిస్టులు ఎస్ఎల్‌బీసీకి చేరుకున్నారు. ఇందులో మొత్తం 12 మంది ఉన్నారు. వీరిని 'ర్యాట్ మైనర్స్' అని పిలుస్తారు. ఇందులో ఆరుగురు ఎస్ఎల్‌బీసీకి చేరుకున్నారు. మరో ఆరుగురు ఢిల్లీ నుండి వస్తున్నారు. 'ర్యాట్ మైనర్' ఖురేషి మాట్లాడుతూ, తాము ఢిల్లీ నుండి వచ్చామని తెలిపారు. నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ తమను పిలిపించాడని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం వివరాలు తమకు పూర్తిగా తెలియవని వెల్లడించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను అనుసరించాలని తమకు సూచనలు అందాయని తెలిపారు.

ఇరు రాష్ట్రాలు తేల్చుకోండి

ఇరురాష్ట్రాల సీఈలు నిర్ణయానికి రావాలి నీటి పంపకాలపై కేఆర్ఎంబీ వెల్లడి

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ప్రత్యేక సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 24, (రిపబ్లిక్ న్యూస్): కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ప్రత్యేక, అత్యవసర సమావేశం జరిగింది. ప్రస్తుత నీటి సంవత్సరంలో మిగిలిన కాలానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు నీటి వాటాలపై చర్చించేందుకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కేఆర్ఎంబీ ఛైర్మన్ అతుల్ జైన్ నేతృత్వంలో హైదరాబాద్ జలసౌధలో సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శితో బోర్డు ఛైర్మెన్ సమావేశానికి హాజరయ్యారు.ప్పటికే ఏపీ ఎక్కువ నీటిని వినియోగించుకున్నందన్న తెలంగాణ శ్రీశైలం నుంచి ఏపీ నీటి వినియోగాన్ని పూర్తిగా ఆపాలని డిమాండ్ చేసింది. నీటి అవసరాలపై ఇరురాష్ట్రాల సీఈలు నిర్ణయానికి రావాలన్న కేఆర్ఎంబీ సాగర్ కింద పంటల దృష్ట్యా నిర్ణయం తీసుకోవాలని కోరింది. ప్రస్తుత ఏడాది కృష్ణా జలాల్లో తెలంగాణకు 131, ఆంధ్రప్రదేశ్ కు 27 టీఎంసీలు మిగిలి ఉన్నాయని ఇటీవల బోర్డు తేల్చింది. ఈ నెల11 వ తేదీ వరకు నాగార్జున సాగర్?లో 510 అడుగుల పైన 63, శ్రీశైలంలో 834 అడుగుల పైన 30 టీఎంసీల నీరు మిగిలి ఉంది. రెండు జలాశయాల్లో నీటి నిల్వలు, జూన్ – జూలై వరకు తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని వివిధ ఔట్ లెట్ల నుంచి నీరు తీసుకునే ప్రణాళిక వివరాలు ఇవ్వాలని రెండు రాష్ట్రాలను ఇప్పటికే బోర్డు కోరింది. అటు ఆంధ్రపదేశ్ ఎక్కువ నీటిని ఉపయోగించుకుంటోందని, తెలంగాణ ప్రభుత్వం బోర్డు కేంద్ర ప్రభుత్వానికి కొన్ని రోజులు క్రితం ఫిర్యాదు చేసింది.

మిర్చి రైతులకు కేంద్రం గుడ్‌న్యూస్

కనీస ధర రూ. 11,781కు పెంపు

అమరావతి, ఫిబ్రవరి 24, (రిపబ్లిక్ న్యూస్):

ఏపీలో మర్చిధరలు పడిపోవడంతో రైతుల్ని ఆదుకోవడానికి కేంద్రాన్ని చంద్రబాబు రంగంలోకి దించారు. మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద కేంద్రం కనీస ధరను రూ. రూ. 11,781 గా నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. క్వింటా మిర్చికి ఈ ధర వర్తిస్తుంది. ధరలు భారీగా పడిపోవడంతో రైతులు నష్టానికి అమ్ముకుంటున్నారు. ఇక నుంచి సాగు ఖర్చు.. అమ్మకపు వ్యయం మధ్య వ్యత్యాన్ని కేంద్రం చెల్లిస్తుంది.వ్యవసాయ ఉత్పత్తుల ధరలు బాగా పడిపోయినప్పుడు, రాష్ట్రాలు సాయం కోరితే మద్దతు ధర పథకాల పరిధిలోకి రాని వ్యవసాయ ఉత్పత్తులను కేంద్రం సేకరిస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఆ నష్టాలను భరిస్తుంది. దీనికి మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ అని పేరు పెట్టారు. కేంద్రం గిట్టుబాటు ధర ప్రకటించే వాణిజ్యపంటల జాబితాలో మిర్చి చేర్చకపోవడం వల్ల మిర్చికి ఈ ఫథకాన్ని అమలు చేస్తున్నారు. ఎగుమతులు కేంద్రం చేతిలోనే ఉంటాయి కాబట్టి..ఎగుమతి విధానంపై కేంద్రం కొన్ని నిర్ణయాలు తీసుకుంటే డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. ఏపీలో దాదాపు 4 లక్షల ఎకరాల్లో మిర్చి

సాగు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే 1.40 లక్షల ఎకరాల్లో సాగు చేసినట్లుగా ప్రభుత్వ వర్గాలుచెబుతున్నాయి. ఎకరాకు రూ.లక్షన్నర నుంచి రూ.రెండు లక్షలు పెట్టుబడి ఖర్చులవుతాయి. ఓ ఏడాది క్వింటాల్ గరిష్టంగా రూ.26 వేల వరకు వెళ్లడంతో రైతులు ఈసారి కూడా అధిక ధరలు వస్తాయన్న భావనతో భారీగా సాగు చేశారు. 2024 మార్చి తర్వాత ధర రూ.20వేల నుంచి సగానికి పడిపోవడంతో రైతులు మళ్లీ ధరలు పెరుగుతాయనే ఆశతో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్నారు. అప్పటి నుంచి ధరలు ఆశించిన స్థాయిలో పెరగకపోవడంతో 30 లక్షల బస్తాలకు పైగా స్టోరేజీల్లోనే మిగిలిపోయింది. ఇప్పుడు పదిలక్షల బస్తాల కొత్త పంట కూడా వచ్చి చేరడంతో మొత్తంగా దాదాపు 40 లక్షల బస్తాలు కోల్డ్ స్టోరీజీల్లోనే ఉన్నాయి. ఈ కారణంగా కూడా ధరలు తగ్గుతున్నాయి. మిర్చి రైతులకు మేలు చేసేందుకు వారి పంటలకు సరైన ధర ఇప్పించేందుకు చంద్రబాబునాయుడు ఢిల్లీ పర్యటనలో పలువురు కేంద్ర మంత్రుల్ని కలిశారు. తర్వాత రామ్మోహన్ నాయుడు, పెమ్మసానిచంద్రశేఖర్ వంటి వారు కేంద్ర వ్యవసాయశాఖతో నిరంతరం సంప్రదింపులు జరిపి.. మద్దతు ధరను ప్రకటించేలా చేయగలిగారు. ఈ నిర్ణయంతో ధరలు పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయని అంచనా వేస్తున్నారు. ఎగుమతలపై కేంద్రం విధించిన కొన్ని ఆంక్షలను తొలిగిస్తే డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నారు. ఈ దిశగా కూడా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఊబకాయంపై ప్రధాని మోడీ ఆందోళన

వంటనూనెల వినియోగం తగ్గించండి -ప్రజల్లో అవగాహన కోసం పదిమంది నామినేట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24, (రిపబ్లిక్ న్యూస్):

దేశంలో ఊబకాయ సమస్య పెరిగిపోతుందని.. దీనిపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ప్రధాని మోడీ అన్నారు. ఈ సమస్యను అధిగమించాలంటే.. వంట నూనెల వినియోగాన్ని తగ్గించాలని ఆయన సూచించారు. ఈ సమస్యపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి పది మంది ప్రముఖులను నామినేట్ చేశారు. వారిలో ప్రముఖ మలయాళ నటుడు మోహన్‌లాల్, గాయకురాలు శ్రేయోఘోషల్ కూడా ఉన్నారు. ఆదివారం జరిగిన మన్‌కీబాత్ 119వ ఎపిసోడ్ కార్యక్రమంలో మోడీ ఊబకాయ సమస్య గురించి ప్రస్తావించారు. 'గత కొన్నేళ్లుగా దేశంలో ఊబకాయ సమస్య పెరిగిపోతుంది. ముఖ్యంగా చిన్నారుల్లో ఈ సమస్య పెరిగిపోతోంది. ఈ సమస్యను అధిగమించాలంటే

తినే ఆహారంలో చిన్న చిన్న మార్పులు చేసుకోవాలని ఆయన సూచించారు. గత కొన్నేళ్లుగా ఊబకాయం కేసులు రెట్టింపయ్యాయి. ఈ గణాంకాలు ఆందోళన కలిగిస్తోంది. ప్రతి ఎనిమిది మందిలో ఒక్కరైనా ఊబకాయ సమస్యతో బాధపడుతున్నారు. ఈ సమస్యను అధిగమించాలంటే ప్రతినెలా పదిశాతం వంట నూనె వినియోగాన్ని తగ్గించాలి. ఈ చిన్న మార్పు ప్రజారోగ్యంపై పెద్ద ప్రభావం చూపుతుంది. మీ ఆహారపు అలవాట్లు మిమ్మల్ని ఫిట్‌గా ఉంచుతాయి. ఈ సమస్యపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు.. ఆరోగ్యవంతమైన దేశాన్ని నిర్మించేందుకు క్యాంపెయిన్ నిర్వహించాలి' అని ఆయన అన్నారు. కాగా, ఈ క్యాంపెయిన్‌కు ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా, జమ్ము కాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా, యువ షూటర్ మను బాకర్, వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను, ప్రముఖ నటులు దినేశ్‌లాల్ యాదవ్, ప్రముఖ మలయాళ నటుడు మోహన్‌లాల్, మాధవన్, గాయకురాలు శ్రేయా ఘోషల్, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, రాజ్యసభ ఎంపి సుధామూర్తి అను ప్రధాని మోడీ నామినేట్ చేశారు. ఈ మేరకు వీరి పేర్లను మోడీ ఎక్స్ పోస్టులో వెల్లడించారు.

ఎన్ని ఏఐలు వచ్చినా... ఐదుగురు

మనుషులతో సమానం కాదు

: నందన్ నీలేకని

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24, (రిపబ్లిక్ న్యూస్): ఇప్పుడు దాదాపు ప్రతి రంగాన్ని ఏఐ (కృత్రిమ మేధ) టెక్నాలజీ శాసించే పరిస్థితి నెలకొంది. ఏఐతో పనులు సులువుగా నెరవేరుతుండడంతో, ప్రభుత్వాలు సైతం ఈ దిశగా అడుగులు వేస్తున్నాయి. అయితే, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని ఆలోచనలు మరోలా ఉన్నాయి. మీరు ప్రపంచంలోని ఏఐలు అన్నింటినీ తీసుకురండి... కానీ ఐదుగురు మనుషులు కలిసి పనిచేసిన దాంతో సమానం కాదు అని అన్నారు. ఏఐ కంటే మానవ మేధ గొప్పదని మీరే అంటారు అని వ్యాఖ్యానించారు.

బొత్తిగా తెలియని సాంకేతిక నైపుణ్యాల కోసం పాకులాడడం కంటే, ఏఐ ప్రతిఫలించలేని స్వీకరణ సామర్థ్యాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఏఐ ఎంతో యాంత్రికమైన వ్యవస్థ అని, ఇది మానవ శక్తిని పూర్తిగా భర్తీ చేయలేదని అభిప్రాయపడ్డారు.

టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినా, మనిషికి మాత్రమే సాధ్యమైన అంశాలు కొన్ని ఉంటాయని... పరస్పర సహకారం, సృజనాత్మకత, సానుభూతి, నాయకత్వం వంటి విషయాల్లో మానవ శక్తిని ఏఐ

అధిగమించలేదని నందన్ నీలేకని వివరించారు. ఏఐ ఎంత యాంత్రికంగా మారుతుందో, మానవ గుణాలు అంత విలువైనవిగా మారతాయని పేర్కొన్నారు. ఏఐ ఎప్పుడూ సృష్టించలేదని, కేవలం అనుకరిస్తుందని నందన్ నీలేకని ఒక్క మాటలో తేల్చేశారు.

బ్రహ్మాండంగా మహానందీశుడి బ్రహ్మోత్సవాలు

- గోపూజతో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం
- మయూరవాహనంపై విహరించిన మహానందీశుడు .

మహానంది, ఫిబ్రవరి 24, (రిపబ్లిక్ న్యూస్): మహానందీశ్వరుడి సన్నిధిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం బ్రహ్మాండంగా ప్రారంభమయ్యాయి. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర ఆవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, రుత్వికులు, అర్చకులు ఉదయం నుంచి రాత్రి వరకు శాస్త్రోక్తంగా పూజలను నిర్వహించారు. అందులో భాగంగా ఉదయం గణపతిపూజ, పుణ్యాహవాచనం, త్రిశూల పూజ, వాస్తుశాంతి, దీక్షధారణ, కంకణ ధారణ, శాస్త్రీయంగా పుట్టమన్ను తీసుకుని వచ్చి అంకురార్పణ, పండిత పూజ, తదితర పూజలు చేశారు.

సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం:

మహానందీశ్వరుడి సన్నిధిలో వైభవంగా ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ సోమవారం రాత్రి

ధ్వజారోహణం పూజలు చేశారు. స్థానిక ధ్వజస్థంభం వద్ద ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆనంతరం ధ్వజారోహణం చేశారు.

మయూర వాహనంపై మహానందీశుడు:

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహానందీశుడు సోమవారం రాత్రి మయూరవాహనంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి చేపట్టిన ఆలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ ప్రాకారంలో, మాడ వీధుల వెంట స్వామివారు మయూరవాహనంపై రాగా వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాల్లో ఏఈఓ ఎరమల మధు, ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్ రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు శ్రీశైలం శ్రీనివాసులు(చిన్నా), మహానంది శ్రీనివాసులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుంభమేళాపై వక్రబుద్ధి

తప్పడు కథనాల పై అధికారుల చర్యలు -140 సోషల్ మీడియా అకౌంట్స్ సీజ్

ప్రయాగ్‌రాజ్ ఫిబ్రవరి 24, (రిపబ్లిక్ న్యూస్): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ లో జరుగుతున్న ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహాకుంభమేళా మరో రెండు రోజుల్లో ముగియనుంది. 45 రోజుల పాటూ సాగే ఈ కుంభమేళాలో ఇప్పటికే 60 కోట్ల మందికిపైగా భక్తులు త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. అయితే, మహాకుంభ్‌పై తప్పుదారి పట్టించే కంటెంట్ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. కొందరు దీనిపైనా దురుద్దేశ్య పూర్వక కథనాలు ప్రసారం చేపట్టారు. దీంతో వీటిపై అధికారులు చర్యలు చేపట్టారు. మహాకుంభ్‌పై తప్పుదారి పట్టించే కంటెంట్‌ను వ్యాప్తి చేసిన 140 సోషల్ మీడియా అకౌంట్స్‌పై కేసు నమోదు చేసినట్లు మహాకుంభ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వైభవ్ కృష్ణ వెల్లడించారు. ఆయా సోషల్ మీడియా ఖాతాలపై 13 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు. ఇక ఈ మహాకుంభమేళా ముగింపు రోజు ఫిబ్రవరి 26న జరగనున్న మహాశివరాత్రి పండుగకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. ఆరోజు పెద్ద సంఖ్యలో జనం ప్రయాగ్‌రాజ్‌కు వస్తారని అంచనా వేసినట్లు చెప్పారు. ఈ మేరకు మహాకుంభ్ ప్రాంతంలో ఎక్కడా ట్రాఫిక్ జామ్ లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఎంత మంది యాత్రికులు వచ్చినా పోలీసు యంత్రాంగం పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. కాగా, పౌష్ పూర్ణిమ సందర్భంగా జనవరి 13న ఈ మహాకుంభమేళా ప్రారంభమైన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26 శివరాత్రితో ముగియనుంది. దాదాపు 45 రోజుల పాటు సాగే ఈ కుంభమేళాకు ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు కోట్లాదిగా తరలివస్తున్నారు. అక్కడ గంగ, యమున, సరస్వతి నదులు కలిసే పవిత్ర త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. మరో రెండు రోజుల్లో ఈ కుంభమేళా ముగియనుంది.

శ్రీలంక అదుపులో 700పైగా బోట్లు

రామేశ్వరంలో మత్స్యకారుల ఆందోళన

చెన్నై, ఫిబ్రవరి 24, (రిపబ్లిక్ న్యూస్): తమిళనాడులోని రామేశ్వరంలో మత్స్యకారులు సోమవారం నుండి నిరవధిక సమ్మెకు దిగారు. శ్రీలంక నేవీ నిర్బంధంలో ఉన్న మత్స్యకారులను, పడవలను వంటనే విడుదల చేయాలని మత్స్యకారుల సంఘం డిమాండ్ చేస్తోంది. 700కిపైగా బోట్‌లను హార్బర్‌లో నిలిపివేయడంతో రామేశ్వరంలోని ఫిషింగ్ హార్బర్ నిర్మానుష్యంగా మారింది. శ్రీలంక నేవీ నిర్బంధించిన బందీలను వెంటనే విడిపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సమావేశంలో తీర్మానం చేసినట్లు రామేశ్వరం మత్స్యకారుల సంఘం కార్యదర్శి సగాయం పేర్కొన్నారు. మత్స్యకారుల బోట్లను వేలం వేయకుండా చూడాలని కోరారు. త శనివారం రామేశ్వరం నుండి 440 బోట్లలో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లారు. పాల్క్‌బే సముద్ర ప్రాంతంలో చేపల వేట సాగిస్తుండగా, శ్రీలంక నేవీ అధికారులు పెట్రోలింగ్ బోట్‌లో అక్కడికి చేరుకున్నారు. అంతర్జాతీయ సముద్ర సరిహద్దును దాటారంటూ 5 పడవలను, 32 మంది మత్స్యకారులను అదుపులోకి తీసుకున్నారు. భారతీయ మత్స్యకారులను శ్రీలంకనేవీ అదుపులోకి తీసుకుంటున్న ఘటనలు పెరగడంపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం సంయుక్త కార్యవర్గాన్ని (జెడబ్ల్యుజి) సమావేశపరచాలని విదేశాంగమంత్రి జై శంకరకు రాసిన లేఖలో పేర్కొన్నారు. గత జనవరి నుండి 131 మంది తమిళనాడు మత్స్యకారులను శ్రీలంక నేవీ అదుపులోకి తీసుకుంది. 18 బోట్లను స్వాధీనం చేసుకుంది.

మార్చి19 వరకు ఎపి అసెంబ్లీ సమావేశాలు

అమరావతి, ఫిబ్రవరి 24, (రిపబ్లిక్ న్యూస్): మార్చి 19వ తేదీ వరకు అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని బీఏసీ నిర్ణయించింది.. మొత్తంగా 15 వర్కింగ్ డేస్ లో సమావేశాలు జరగనున్నాయి.. అవసరం అయితే మరో రెండు రోజులు పొడిగించాలని బీఏసీలో నేతలు అభిప్రాయపడ్డారు.. వారానికి ఐదు రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి.. ఏపీ అసెంబ్లీ సమావేశాలు గవర్నర్ ప్రసంగంతో సోమవారం ప్రారంభం అయ్యాయి.. అనంతరం సభ మంగళవారానికి వాయిదా పడింది. సభానంతరం బిఎసి సమావేశమై సమావేవ తేదీలపై చర్చించింది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన బిఎసి జరిగింది. సిఎం చంద్రబాబు తదితరులు హాజరయ్యారు. సభను వచ్చే నెల 19 వరకు జరపాలని బీఏసీ లో నిర్ణయించారు.. అవసరం అయితే మరో రెండు రోజులు పాటు రిజర్వ్ లో ఉంచారు.

పట్టు గొడుగులు విరాళం

మహానంది, ఫిబ్రవరి 24, (రిపబ్లిక్ న్యూస్): మహానందిలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా.. వాహన సేవలకు అవసరమైన పట్టుతో తయారు చేసిన గొడుగులు దాతలు బహుకరించినట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గోపవరం గ్రామానికి చెందిన సంగా లక్ష్మి కాంతరెడ్డి, మాధవి, కుశాల్ రెడ్డి కుటుంబ సభ్యులు సోమవారం నూతన పట్టు గొడుగులను ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. శ్రీనివాసరెడ్డికి భక్తితో సమర్పించారు. దాతలను ఆలయ అధికారులు అభినందించారు.

అక్రిడిటేషన్లను త్వరతగతిన పునరుద్ధరించాలి

కలెక్టర్ కు వినతి పత్రం అందజేత -యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం (యుజెఎఫ్) నగర కమిటీ

కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 24 (రిపబ్లిక్ న్యూస్) జర్నలిస్టుల అక్రిడిటేషన్ లను త్వరతగతిన పునరుద్ధరించాలని యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం (యూజేఎఫ్) నాయకులు అన్నారు. సోమవారం జిల్లా,కలెక్టర్ కార్యాలయం,సునయన అడిటోరియం,ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో నగర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాషను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నగర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పి.నాగేంద్రుడు,జి.మునిస్వామి మాట్లాడుతూ... జర్నలిస్టులకు ప్రభుత్వం మంజూరు చేసిన అక్రిడిటేషన్ కాలపరిమితి ఈనెల 28వ తేదీతో గడువు ముగియనుందన్నారు. కావున త్వరితగతిన నూతన అక్రిడిటేషన్లను పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో జర్నలిస్టులు తమ బస్సు చార్జీల రాయితీలను నష్టపోవాల్సి వస్తుంది. వెంటనే అక్రిడిటేషన్ లో పునరుద్ధరణ ప్రక్రియను ప్రారంభించి మార్చి,1వతేదీ లోపలనే జర్నలిస్టులు అక్రిడిటేషన్లను పునరుద్ధరించి ఆర్టీసీ చార్జీలో రాయితీకి ఆటంకం రాకుండా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ స్పందిస్తూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ కు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిఫారస్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో యుజెఎఫ్ జిల్లా నాయకులు నీలం సత్యనారాయణ, చంద్రమోహన్,విజయ్ కుమార్, మల్లికార్జున,నగర కోశాధికారి రాజశేఖర్, నాయకులు అసిఫ్, వరప్రసాద్, జయరాజు, రవిగౌడ్,కరణ్, ప్రసాద్,శేఖర్, లోకేష్, రవి,ఉరుకుందు,సంజీవయ్య, జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

కేంద్ర ఎన్నికల కమిషన్కు కొత్తూరు సత్యం లేఖ

కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 24 (రిపబ్లిక్ న్యూస్) కేంద్ర ఎన్నికల కమిషన్కు ఒక లేఖ పంపిస్తున్నానని జనతా ఫౌండేషన్ అధినేత కొత్తూరు సత్యనారాయణ గుప్తా తెలిపారు. సోమవారం ఆయన ను కలిసిన మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల నాటికి ఎన్నికలు పారదర్శకంగా ఉండేందుకు ప్రజల కోరిక మేరకు లేఖ రాస్తున్నానని ఆయన తెలిపారు. ఎన్నికలకు ముందు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వపరంగా పాలన సాగిస్తూ ఉంటారని, ఎన్నికల సమయంలో ఐఏఎస్ అధికారులన్నీ కాకుండా ఎన్నికల అధికారులను ఎన్నికలు నిర్వహించేలా ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో ఎన్నికల అధికారులను నియమించాలని ఓటర్ల నమోదు కార్యక్రమాలు ఎన్నికల సజావుగా సాగించేందుకు ప్రజలను చైతన్యం కలిగించేందుకు ఎన్నికల పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేక యంత్రాంగం ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఆయా ప్రభుత్వ ఒత్తిడి మేరకు బోగస్ ఓటర్లు నమోదు అయ్యే అవకాశాలు ఉంటాయని దీని ఫలితంగా ప్రజలు కోరిన ప్రభుత్వం ఏర్పడదన్నారు. అందుకుగాను ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ఎన్నికల అధికారులను ప్రతి జిల్లా కేంద్రంలో నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. అప్పుడే ప్రజాక్షేత్రంలో ప్రజలకు న్యాయం జరుగుతుందని ప్రజలు కోరిన పాలకులు ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. గతంలో తాను ఒక లేఖ రాశానని కేంద్ర ఎన్నికల కమిషన్ నుండి సమాధానం రాలేదని, మరోసారి లేక పంపిస్తున్నానని ఆయన తెలిపారు. తన లేఖకు కు ఎన్నికల కమిషన్ నుండి సమాధానం వస్తుందని ఈ విధానాన్ని అన్ని రాజకీయ పార్టీలు స్వాగతించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 13 వినతులు

కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి24(రిపబ్లిక్ న్యూస్) ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ అన్నారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజావ్యదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 13 అర్జీలు వచ్చాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అదనపు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ ఎన్.చిన్నరాముడు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంఈలు శేషసాయి, సత్యనారాయణ, ఆర్ఓ జునైద్, శానిటేషన్ సూపర్వైజర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వచ్చిన అర్జీల్లో కొన్ని..

1. 15వ వార్డు బుధవారపేట నగరపాలక ప్రాథమిక పాఠశాలను అద్దె భవనంలో పైగా పై అంతస్తులో కాకుండా, పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించాలని జై భీమ్ దళిత వికాస సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి హరికృష్ణ, తదితరులు విన్నవించారు.
2. 19వ వార్డు మారుతి నగర్, టైపిస్ట్ కాలనీ వాసుల ప్రధాన రహదారి అధ్వాన్నంగా ఉందని, జాతీయ రహదారి నుండి సుద్దవాగు వరకు సిసి రహదారి నిర్మించాలని స్థానికులు తిమ్మయ్య, నరసింహులు, రవికుమార్, చాంద్ భాషా తదితరులు విన్నవించారు.
3. 12 వార్డు బాపూజీ నగర్ ఎస్సీ కాలనీలో రోడ్డు ఇరువైపులా డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయారని, త్వరగా పనులు చేపట్టాలని స్థానికులు శేఖర్, రమేష్ బాబు తదితరులు కోరారు.
4. తమకు టిడ్కోలో గృహాలు కేటాయించాలని మరియమ్మ, పి.సుష్మ, ఎం.దేవమ్మ తదితరులు విన్నవించారు. 5. రాష్ట్రంలో మున్సిపల్ కార్మికుల దీర్ఘకాల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు మునియప్ప, నాగరాజు, రాజు, మద్దిలేటి వినతిపత్రం సమర్పించారు.

కూటమి ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట వేస్తుంది

ప్రభుత్వాసుపత్రుల్లో అధునాతన సౌకర్యాల కలిపిస్తాం... ఎం.పి బస్తిపాటి నాగరాజు

కర్నూల్ ప్రతినిధి ఫిబ్రవరి 24 (రిపబ్లిక్ న్యూస్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను ఎం.పి బస్తిపాటి నాగరాజు సందర్శించారు.. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు తో కలిసి పలు వార్డులను ఆయన పరిశీలించారు. ఎం.పి ఆసుపత్రి లో అందుతున్న వైద్య సదుపాయాలు, కలిపిస్తున్న సౌకర్యాల పై రోగులను అడిగి తెలుసుకొని.. విధుల్లో ఉన్న వైద్యులు, సిబ్బంది వివరాల పై ఆరా తీశారు.. అనంతరం ఆసుపత్రిలో నెలకొన్న సమస్యల తో పాటు పలు అంశాలపై సూపరింటెండెంట్ తో చర్చించారు..ఈ సందర్భంగా ఎం.పి నాగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైద్యరంగానికి పెద్ద పీట వేస్తుందన్నారు.. ప్రభుత్వాస్పత్రులలో అధునాతన సౌకర్యాలు కలిపించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు.

జిఎన్ఆర్ హాస్పిటల్ లో పనిచేస్తున్న దేవమ్మకు ఆర్థిక సహాయం

జిఎన్ఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ నాగేశ్వరయ్య

కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 24(రిపబ్లిక్ న్యూస్): జిఎన్ఆర్ హాస్పిటల్ లో గత మూడు సంవత్సరాలుగా ఆయాగా పనిచేస్తున్న దేవమ్మ భర్త అనారోగ్యంతో మృతి చెందాడు ఆమెకు ఇద్దరు కుమార్తెలు విషయం తెలుసుకున్న డాక్టర్ నాగేశ్వరయ్య ఆమెకు ఆమెకు ఆర్థిక సహాయంగా 50 వేల రూపాయలు జిఎన్ఆర్ హాస్పిటల్ లో సహాయం అందించారు. భవిష్యత్తులో ఆమెకి వారి కుమార్తెలకు చదువులకు గాను హాస్పిటల్ తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు అలాగే ప్రతి హాస్పిటల్ లో పనిచేస్తున్న ఆయాలు గానీ నర్సులు గాని డ్యూటీ నర్సులు బీదవారు ఎంతోమంది ఉంటారు హాస్పిటల్ కి నమ్మే వాళ్లు పనిచేస్తూ జీవనం కొనసాగిస్తూ ఉంటారు అలాంటి వారికి హాస్పిటల్ అండగా నిలవాలని నేను కోరుకుంటున్నానుఈ కార్యక్రమంలో జిఎన్ఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ నాగేశ్వరయ్య, వారి సతీమణి లక్ష్మీదేవి, డాక్టర్ మహేష్ నాయుడు, డ్యూటీ డాక్టర్ నాగేంద్ర,,మేనేజర్ శివ , హాస్పిటల్ ఇన్చార్జి కుమార్, మరియు జిఎన్ఆర్ హాస్పిటల్ నర్సులు డాక్టర్లు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంట కొనుగోలు కేంద్రాలు పునః ప్రారంభించాలి

పత్తి పంటకు క్వింటాలుకు పదివేల రూపాయలు ఇవ్వాలి

ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ డిమాండ్.

కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 24 (రిపబ్లిక్ న్యూస్) పత్తి పంట కొనుగోలు కేంద్రాలను తిరిగి ప్రారంభించాలని క్వింటాలుకు పదివేల రూపాయలు తక్కువ కాకుండా రైతులకు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఏ కృష్ణ గూడూరు మండలం అధ్యక్షులు కృష్ణారెడ్డి తదితరులు డిమాండ్ చేశారు

ఈరోజు ప్రజా దర్బారులో జిల్లా కలెక్టర్ రంజిత్ భాష ను కలిసి రైతు సంఘం నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జి రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు పైగా పత్తి పంట సాగు అయిందని దిగుబడి కూడా ఈ సంవత్సరం కొంత మెరుగైందని ఎనిమిది క్వింటాళ్ల నుండి 12 13 14 క్వింటాళ్లు ఎకరాకు వచ్చాయని ఆయన తెలిపారు దిగుబడి వచ్చినప్పటికీ ధర లేకపోవడం వలన రైతులు పెట్టిన పెట్టుబడిదాకా అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఖరీఫ్లో పండిన పంట నవంబర్ మాసం వరకు పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఆదోని మంత్రాలయం ఎమ్మిగనూరు కోడుమూరు మండలాలలో సుమారుగా 12 కేంద్రాలలో ఏర్పాటుచేసి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా రైతుల నుండి పత్తి కొనుగోలు చేశారు కానీ ఉన్నట్లుండి నవంబర్ మాసం చివర్లో పత్తి కొనుగోలు కేంద్రాలు మూసివేశారు ఫలితంగా రైతులు లబోదిబోమంటున్నారు రైతులకు సమాచారం ఇవ్వకుండా ఎందుకు కొనుగోలు కేంద్రాలు మూసివేశారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు ఇప్పటికీ కర్నూలు జిల్లాలో 50 వేల క్వింటాళ్ల వరకు రైతుల దగ్గర నిలువ ఉన్నాయని ,ప్రారంభంలో తీసిన పత్తి ఇప్పటికీ రైతుల దగ్గర ఉన్నదని వాటిని కొనుగోలు చేయకపోతే రైతులు అమాంతం నష్టపోయే పరిస్థితి ఉందని కావున కలెక్టర్ గారు తక్షణమే జోక్యం చేసుకోవాలి కొనుగోలు కేంద్రాలను తిరిగి ప్రారంభించి పూర్తి పత్తిని కొనుగోలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు కలెక్టర్ రంజిత్ భాష సానుకూలంగా స్పందిస్తూ తక్షణమే మార్కెటింగ్ వారు సిసిఐ వారితో కోఆర్డినేషన్ చేసుకొని తిరిగి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్ భాష అదేచించారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే మధు రైతులు సీతా రాముడు శివన్నా ఆంజనేయులు షేక్షావలి ఇంకా అనేక మంది రైతులు పాల్గొన్నారు.

శివ భక్తులకు మహాశివరాత్రి సందర్భంగా విద్యుత్ శాఖ వారి సూచన

కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 24 (రిపబ్లిక్ న్యూస్) మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని అందరికీ శివరాత్రి శుభాకాంక్షలు తెలియపరుస్తూ కర్నూలు మరియు నంద్యాల జిల్లాలలోని శైవ క్షేత్రాలను సందర్శించు భక్తులకు మరియు ఆలయ కార్యవర్గాలకు తెలియజేయడమేమనగా మహాశివరాత్రి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణాలలో ఫోకస్ లైట్లను మరియు ఆలయ అలంకరణకు వాడు డెకరేషన్ లైట్లకు విద్యుత్ సరఫరా అందించు వైర్లను ముందుగానే తనిఖీ చేసుకొని జాయింట్ లు లేకుండా ఉంచుకోవాలని అలాగే జనసమూహము ఎక్కువగా ఉన్నప్పుడు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లకు మరియు వైర్లకు దూరంగా ఉండవలెనని అలాగే ఏదైనా ప్రమాదవశాత్తు తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉంటూ సమీప విద్యుత్ అధికారులకు గాని లేదా 1912 టోల్ ఫ్రీ నెంబర్ గాని తెలియపరచవలనని ఉమ్మడి జిల్లా సర్కిల్ ఇన్స్పెక్టర్ విజిలెన్స్ విభాగం పి నాగరాజు యాదవ్ గారు ఉమ్మడి జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ ఏం ఉమాపతి తెలియజేశారు.

ప్రభుత్వ బి.సి., ఎస్. సి, ఆనంద నిలయం హాస్టల్స్ , కలెక్టర్ ఆఫీస్ కాంపౌండ్ , సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జిల్లా జడ్జి జి. కబర్ధి, కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి

కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 24 (రిపబ్లిక్ న్యూస్) జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా జడ్జి జి. కబర్ధి ,కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి సోమవారం కర్నూలు కలెక్టర్ ఆఫీస్ నందు గల ప్రభుత్వ బి.సి., ఎస్. సి, ఆనంద నిలయం హాస్టల్స్ ను సందర్శించారు. రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 15వ తేదీన హాస్ట ల్స్ లను తనిఖీ చేయడానికి వచ్చినప్పుడు జిల్లా జడ్జి గారికి హాస్టల్ లోని పిల్లలు టీవీలు కావాలని కోరారు. వారి కోరిక మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో

పంజాబ్, యూనియన్,కరూర్ వైశ్యా బ్యాంకుల సహకారముతో ఈ రోజు మూడు హాస్టల్స్ కు మూడు స్మార్ట్ టీవీలు జిల్లా జడ్జి గారి చేతులమీదుగా హాస్టల్స్ వార్డెన్స్ కు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్. సి. వెల్ఫేర్ ఆఫీసర్ రంగ లక్ష్మి ,అసిస్టెంట్ బి. సి. వెల్ఫేర్ ఆఫీసర్ ఆంజనేయులు,కరూర్ వైశ్యా బ్యాంకు మేనేజర్ పీరయ్య , యూనియన్ బ్యాంకు మేనేజర్ రజని , పంజాబ్ నేషనల్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు, హాస్టల్స్ వార్డెన్స్ ఆయా సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఇంటింటి సర్వే

కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 24 (రిపబ్లిక్ న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు సోమవారం కర్నూలు గవర్నమెంట్ హాస్పిటల్ లో గల డైస్ సెంటర్ నందు న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, న్యాయమూర్తి మాట్లాడుతూ గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు లీగల్ సర్వీసెస్ వారు ఇంటింటి సర్వే నిర్వహించడానికి న్యాయవాదులు, పారా లీగల్ వలుంటీర్లు, ఆశ వర్కర్ ర్లు , ఎ.ఎన్.ఏం.,లు, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్లచే టీమ్లను ఏర్పాటుచేసి కర్నూలు మరియు నంద్యాల జిల్లాల లో విభిన్న సామర్థ్యం గల పిల్లలు మరియు చిన్న వయస్సులోనే ఆరోగ్య లోపాలు గల పిల్లలను గుర్తించి వారికి బాలల సత్వర చికిత్స కేంద్రం ద్వారా చికిత్సలు చేపించడం జరుగుతుందని గుర్తించిన ఆరోగ్య లోపాలు గల పిల్లలను ఈ డైస్ సెంటర్ కు తీసుకోని వచ్చి అక్కడి డాక్టర్ లచే చికిత్స లు చేపించారు.అక్కడి పిల్లలు తల్లి దండ్రులకు ఈ వైద్య సదుపాయల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ జిల్లా మెడికల్ మరియు హెల్త్ ఆఫీసర్ భాస్కర్, డైస్ సెంటర్ ప్రోగ్రాం ఆఫీసర్ శై లే ష్ కుమార్, ప్రోగ్రాం మేనేజర్ ఇర్ఫాన్, డాక్టర్ సృజన , ఐ. సి. డి. ఎస్. అధికారి శారద,న్యాయవాది లక్ష్మి నారాయణ , డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు, ప్యారా లీగల్ వాలంటీర్స్ హేమంత్, ఏ. ఎన్. ఎం లు, అంగన్వాడీ వర్కర్స్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

కర్నూలు జిల్లా బిసి యూత్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా అశోక్ నియామకం

కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 24(రిపబ్లిక్ న్యూస్): కర్నూలు జిల్లా బీసీ యూత్ ఫెడరేషన్ నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు సైకం రాజశేఖర్ నియమించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా అశోక్, ఉపాధ్యక్షుడిగా గోవర్ధన్, ప్రధాన కార్యదర్శిగా గోపీనాథ్, కార్యనిర్వాహ కార్యదర్శిగా రవి రాజ్, సహాయ కార్యదర్శిగా పవన్ గౌడ్ లను నియమిస్తున్నట్టు నియామక పత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ బీసీల పక్షాన, బీసీల హక్కుల కోసం సమిష్టిగా పోరాడుతామని తెలిపారు. నియామకం పట్ల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికైన సభ్యులకు బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ బాబు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎర్రగూడూరు గ్రామంలో పాములపాడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

పాములపాడు ఫిబ్రవరి 24 (రిపబ్లిక్ న్యూస్):-రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2025 ఫిబ్రవరి-24 నుంచి 28వ తేదీ వరకు, ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను నిర్వహిస్తుందనీ యూనియన్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ రంగస్వామి అన్నారు. అందులో భాగంగా, ఎర్రగూడూరు గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాములపాడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్ రంగస్వామి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్ రంగస్వామి మాట్లాడుతూ, గృహ బడ్జెట్, బ్యాంక్ ఖాతా తెరవడం, సూక్ష్మ పొదుపు గురించి మాట్లాడడం జరిగింది. సేవింగ్ పథకాలైన పి పి ఎఫ్,ఏపీ వై, ఎస్ ఎస్ వై మరియు, ఇన్సూరెన్స్ పథకాల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ టి సి ఎఫ్ ఎల్ కౌన్సిలర్లు కే.రాజు, టి.శివ, నాగరాజు, యూనియన్ బ్యాంక్ సిబ్బంది ఇస్మాయిల్, మరియు పొదుపు మహిళలు పాల్గొనడం జరిగింది.

ఐఈఈఈ ప్రయోజనాలు అనే అంశంపైనా

పాణ్యం, ప్రతినిధి ఫిబ్రవరి,24,ప్రజా రిపబ్లిక్ ,న్యూస్ : పాణ్యం స్థానిక మండలం లోని శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో "ఐఈఈఈ ప్రయోజనాలు మరియు నిధుల అవకాశాలు" అనే అంశంపైనా కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.సుబ్రహ్మణ్యం తేలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.సుబ్రహ్మణ్యం మట్లాడుతు సాంకేతికతను అభివృద్ధి చేయడంపై దృష్టి సరిస్తున్నా, ప్రపంచంలోనే అతిపెద్ద సాంకేతిక సంస్థ ఐఈఈఈ. సాంకేతికంగా మరియు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఇందులో చాలా అవకాశాలను కలిగి ఉంది. కాబట్టి, విద్యార్థులు మరియు అధ్యాపకులు ఆ అవకాశాలను అందిపుచ్చుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ డాక్టర్ వి.నరసింహులు, అసోసియేట్ ప్రొఫెసర్, డిపార్ట్మెంట్ ఆఫ్ ఈఈఈ, ఆర్జిఎంసిఇటి పాల్గొనారు. ఈయన ఐఈఈఈ ప్రయోజనాలు మరియు నిధుల అవకాశాల గురించి స్పష్టంగా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.ఎం.వై. వీరేష్, ఐఈఈఈ కౌన్సిలర్, ఫ్యాకల్టీ సలహాదారులు ఎన్. రమాదేవి, బి. అలేక్య, ఎం. అమరేశ్వర్, ఎం. మహేష్, వి. నాగమణి, ఎస్. జయమంగళ, జి. నీలిమ, డాక్టర్. ఎస్. అల్లావుద్దీన్ మరియు ఐఈఈఈ విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలు నగరంలోని రాజీవ్ గృహకల్ప కు మరమ్మతులు చేపట్టాలి

సీపీఐ ఆధ్వర్యంలో గృహ నిర్మాణ శాఖామంత్రి కొలుసు పార్థసారథికి వినతి పత్రం అందజేత.

కర్నూలు : ప్రతినిధి ఫిబ్రవరి 24(రిపబ్లిస్ న్యూస్) కర్నూలు నగర శివారులో శిథిలావస్థకు చేరుకున్న రాజీవ్ గృహకల్ప కు తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి,మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడలోని గృహ నిర్మాణ శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖామంత్రి కొలుసు పార్థసారథి సీపీఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కె. రామకృష్ణ మాట్లాడుతూ కర్నూల్ నగరంలోని పెద్దపాడు సమీపంలో ఉన్న రాజీవ్ గృహకల్ప సముదాయంలో దాదాపు 28 బ్లాకులో ఉన్నాయని, ఆ బ్లాకుల్లో 1350 కుటుంబాలు నివాసం ఉంటున్నారని, ఈ కాంప్లెక్స్ లను ప్రారంభించి, 15 సంవత్సరాలు కూడా పూర్తిగా గడవకముందే శిథిలావస్థకు చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాంప్లెక్స్ ను నిర్మాణం చేశారు కానీ, అభివృద్ధిని మాత్రం మరిచారని, ఈ గృహకల్ప సముదాయంలో మురికి కాలువలు, డ్రైనేజీ, త్రాగునీటి సౌకర్యం, లేకుండా చాలా దుర్భారమైన జీవనాన్ని కొనసాగిస్తున్నారని, వీటన్నిటిని కల్పించాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఏమైపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెల 17వ తేదీన సిపిఐ ఆధ్వర్యంలో వసతిగృహ సముదాయాన్ని సందర్శించి, అక్కడ నివాసం ఉంటున్న ప్రజల యొక్క పరిస్థితులను అడిగి తెలుసుకున్నామని, వారి పరిస్థితులను ప్రత్యక్షంగా చూడడం జరిగిందని, భవనాలు ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితులు ఏర్పడ్డాయని, అరచేతిలో ప్రాణాలను పెట్టుకొని, ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కావున తక్షణమే రాజీవ్ గృహకల్ప కు మరమ్మతులు చేపట్టి అక్కడ నివాసముంటున్న ప్రజల ప్రాణాలను కాపాడాలని, లేనిపక్షంలో 28 బ్లాక్ లను కూల్చివేసి, అదే స్థలంలో ప్రతి ఒక్కరికి ఇండివిజువల్ హౌసెస్ ను నిర్మించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) గా విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. ఈ వినతి పత్రం సమర్పించిన వారిలో సీపీఐ కర్నూలు నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు,రాజీవ్ గృహకల్ప శాఖ కార్యదర్శి రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

శ్రీ శైలం లోని వ్యాపార సమదాయలను అన్యమతస్థుల నుండి విడిపించాలి

విశ్వ హిందు పరిషత్ కర్నూలు జిల్లా కార్యదర్శి మాళిగి భానుప్రకాష్.

కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 24(రిపబ్లిక్ న్యూస్) ఈరోజు మధ్యాహ్నం 12:30 గంటలకు శ్రీ శ్రీశైల శివభక్త (అన్నదానం) సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ వద్ద గల శ్రీశైల సత్రం నుండి కొండి రెడ్డి బురుజు వరకు వందలాది శివ స్వాములు ర్యాలి నిర్వహించారు, ముఖ్య అతిథిగా హాజరైన విశ్వ హిందూ పరిషత్ కర్నూలు జిల్లా కార్యదర్శి మాళిగి భానుప్రకాష్ మాట్లాడుతూ....శ్రీశైల మహా క్షేత్రం లో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న ఈ శుభ సందర్భంలో మండల దీక్షతో ...ఎంతో పవిత్రంగా "ఇరుముడి" సమర్పించడానికి వచ్చిన శివ స్వాముల పై నిర్దాక్షిణ్యంగా "లాఠీ ఛార్జి" చేయించిన సంబంధిత పోలీసు అధికారి,మరియు పోలీసులను వెంటనే సస్పెండ్ చేసి,శాఖాపరమైన చర్యలతో పాటు విచారించి కఠినంగా శిక్షించాలని శ్రీశైలశివదీక్షా (అన్నదానం) కమిటి మరియు విశ్వ హిందూ పరిషత్ జిల్లా శాఖడిమాండ్ చేస్తున్నదని అన్నారు. సమితి అధ్యక్షులు గోవిందరాజులు మాట్లాడుతూ.... అన్యమతస్థుడైన (ముస్లిం) వ్యాపారి హిందూ పూజావిధానాలపై ఎటువంటి నమ్మకం లేని సదరు వ్యాపారి వస్తువు కొనుగోలుకోసం వచ్చిన స్వామితో కొనుగోలు పై బేధాభిప్రాయం వస్తే శివస్వామి అన్న గౌరవం కూడా లేక చెప్పడానికి , రాయడానికి అలవికాని బూతులు తిడుతూ "తనచెప్పుతో" శివ స్వామి పై నిర్దాక్షిణ్యంగా దాడి చేయడంతో కోపోద్రిక్తులైన శివస్వాములు సదరు వ్యాపార సంస్థపై దాడి చేయడంతో సంయమనం పాటించి వారిని వారించాల్సిన పోలీసులు ఎటువంటి హెచ్చరికలు లేకుండా "లాఠీఛార్జి" చేశారనీ శివస్వాములపై ఈ దాడిని హిందూ సమాజం తీవ్రంగా ఖండిస్తున్నదని ఈ విషయం పై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.తగిన చర్యలు తీసుకోని ఎడల లక్షలాది మంది శివ స్వాములతో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలియజేస్తామని హెచ్చరిస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ కర్నూలు జిల్లా సహకార్యదర్శి గూడూరు గిరిబాబు, రామకృష్ణ,బాబూరావు,సత్యనారాయణ,రవిప్రకాష్ గౌడ్,శినాగరాజు,చంద్రశేఖర్, ప్రసాద్, సురేంద్ర,కాల్వ బుగ్గ శ్రీనివాసులుమరియూ శివ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం,కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాడిన నాయకుడు రాజగోపాల్ :గౌస్ దేశాయ్

కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 24 (రిపబ్లిక్ న్యూస్) ప్రజా సమస్యల పరిష్కారం కోసం, కార్మికుల హక్కుల సాధన కోసం, నిరంతరం తపించిన నాయకుడని, వారి యొక్క సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పోరాడిన యోధుడని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ రాజగోపాల్ ని కొనియాడారు. కర్నూలు నగరంలోని పాతబస్తీలోని హరికిషన్ సింగ్ సుర్జిత్ భవన్ నందు కామ్రేడ్ కే రాజగోపాల్ సంస్మరణ సభ సిపిఎం నగర కార్యదర్శి ఎం రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయ్ మాట్లాడుతూ కే రాజగోపాల్ మొట్టమొదట తన ఉద్యమం పేపర్ మిల్లు లో సాధారణ కార్మికుడిగా ప్రారంభమై, ప్రజానాట్యమండలి జిల్లా మొట్టమొదటి అధ్యక్షుడిగా చరిత్ర ఎక్కారన్నారు కామ్రేడ్ కే రాజగోపాల్ మల్లికార్జున కే రవి ఎంపీ బసవ రాజ్ కలసి అనేక కళారూపాలను ,నాటకాలను వేసి ప్రజలను చైతన్య పరచేవారని, అనంతరం సిఐటియు లో కార్మిక నేతగా పేపర్ మిల్లు సమస్యల సాధన కోసం నిరంతరం పోరాడారని అలాగే, సిపిఎం పార్టీ నాయకుడిగా, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, పనిచేశారని19 95 లో బండి మెట్ట లో మొట్టమొదటి సిపిఎం కార్పొరేటర్ పోటీ చేసి గెలిచారని కార్పొరేషన్ లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన వాణి ని ప్రజా గళాన్నివినిపించారని అనేక సమస్యలను బండి మెట్టు పరిష్కారం చేశారని, అటువంటి నాయకుడు మన మధ్య లేకపోయినా భౌతికంగా లేకపోయినా ఆయన ఆశయాలను మనం సాధన కోసం కృషి చేయాలని అప్పుడే నిజమైన నివాళి అర్పించిన వాళ్ళు అవుతాం అని ఆయన తన ప్రసంగంలో తెలియజేశారు.అనంతరం సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు నిర్మల గారు మాట్లాడుతూ పేపర్ మిల్లు ఉద్యమంలో మొదటి తరం నాయకులు అయినటువంటి టి. షడ్రక్ కే .రాజేశ్వర్ రెడ్డి ,చెన్నారెడ్డి తదితర సహచరుల అనంతరం రాజగోపాల్ , బసవయ్య, కెవి సుబ్బయ్య ,జి. సుబ్బయ్య లాంటి ఆణిముత్యాలను పేపర్ మిల్ ఉద్యమం అంది చ్చిందని ఆ పేపర్ మీల్ యొక్క పోరాటాల ఫలితమే ఈరోజు సిపిఎం పార్టీ ఇంత విస్తారంగా, బలమైన పార్టీగా నిర్మితమవ్వడానికి కామ్రేడ్ టి నరసింహయ్య ,షడ్రక్, గఫూర్ లతో పాటు పేపర్ మిల్ ఉద్యమాన్ని మర్చిపోలేము అని అటువంటి పేపర్ మిల్లు కార్మికుడైన రాజగోపాల్ ఒకరు కావడం గర్వించదగ్గ విషయం అన్నారు రాజగోపాల్ నిరంతరం ప్రజలతో మమేకమైన వ్యక్తి అని అటువంటి నాయకుడు చనిపోవడం మన పార్టీ ఉద్యమానికి కాక, కార్మిక ,పేద బడుగు, బలహీన వర్గాల వారికి కూడా తీరని లోటు అని ఈ లోటును రాబోయే తరం మనమందరం నాయకత్వాన్ని తీసుకొని రాజగోపాల్ ఆశయాల సాధన కోసం కృషి చేయాలని కోరారు ,రాజగోపాల్ గారి కుటుంబానికి సానుభూతిని ఘనమైన నివాళులు అర్పిస్తున్నాననిఆమె తెలియజేశారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ ,సిపిఎం పార్టీ న్యూ సిటీ కార్యదర్శి, టి. రాముడు మాట్లాడారు. ఈ సంస్కరణ సభ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి అంజిబాబు సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, ఓల్డ్ సిటీ, న్యూ సిటీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు, పార్టీ నగర కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు ,పార్టీ సభ్యులు ట్రేడ్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు ,రాజగోపాల్ గారి అభిమానులు , పార్టీ సిఐటియు

సానుభూతి పరులు కుటుంబ సభ్యులైన ,లక్ష్మి అబ్బాయి రవికుమార్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎంపీ బసవరాజ్ ,రాజు, రాంబాబు, నాగస్వాములు , సుబ్బారాయుడు ,నాగ సుంకన్న, బతుకన్నా, సరిత, నోమేశ్వరీ , తదితరులు రాజగోపాల్ పై విప్లవ గీతాలు ఆలపించారు. అనంతరం సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ,డి పార్వతయ్య తన సహచరుడైనటువంటి రాజగోపాల్ పైన మూడు పద్యాలు రాసి సబికులను వినిపించారు. సిపిఎం పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎండి షరీఫ్ వందన సమర్పణతో కే రాజగోపాల్ సంస్మరణ సభ ముగిసింది.

భారీ ఎటిఎం చోరీకి ప్రయత్నించిన దుండగలు

ఉలిందకొండ పోలీసులు, గ్రామ యువకుల అప్రమత్తత తో ఏటిఎం చోరీ విఫలయత్నం.

ఎటిఎం చోరీ ప్రయత్నాన్ని భగ్నం చేసిన పోలీసులను, యువకులను అభినందించిన కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్

పోలీసులకు సహకరించిన యువకులకు రివార్డులు అందజేసిన ... కర్నూలు డిఎస్పీ జె. బాబు ప్రసాద్.

కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 24(రిపబ్లిక్ న్యూస్) కర్నూలు, కల్లూరుమండలం చిన్న టేకూరు గ్రామంలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగలు టోయింగ్ వాహనంతో బ్యాంక్ ఆఫ్ బరోడా ఎటిఎం మిషన్ చోరీ చేయుటకు ప్రయత్నించారు. ఎటిఎం షట్టర్ ను లాగి , లోపలున్న ఎటిఎం మిషన్ ను తాళ్లతో లాగుకొని పోయే ప్రయత్నం జరుగుతుండగా, అక్కడే ఉన్న చిన్న టేకూరు గ్రామ యువకులు దొంగల చర్యలు గమనించి ఉలిందకొండ ఎస్సై ధనుంజయ్ కు ఫోన్ లో సమాచారం అందించారు. ఉలిందకొండ ఎస్సై ధనుంజయ్, ఓర్వకల్లు ఎస్సై సునీల్ , పోలీసులు , గ్రామ యువకులు దొంగల వెంటబడ్డారు. దీనితో దుండగలు ఎటిఎం మిషన్ ను తరలించుకొని పోయే ప్రయత్నం విరమించి టోయింగ్ వాహనం హైవే మీద వదిలేసి పారి పోయారు. ఈ విషయం తెలుసుకున్న కర్నూలు డిఎస్పీ జె. బాబు ప్రసాద్, కర్నూలు రూరల్ సిఐ చంద్రబాబు నాయుడు రాత్రికి రాత్రే ఉలిందకొండ గ్రామంలో ఎటిఎం చోరీయత్నం గురించి విచారణచేసి పోలీసులకు సహకరించిన యువకులు

1. ఎం మహేష్ 2. షేక్. ఇలియాస్
3.దిలావర్ షేక్ అబ్బుల రెహ్మాన్
4 .మొల్లా హనీఫ్ బాషా కర్నూలు డి.ఎస్.పి కార్యాలయంలో కర్నూల్ డిఎస్పి బాబు ప్రసాద్ అభినందించారు. రివార్డులు అందజేశారు.

ఇష్టపడి చదివితే దేనినైనా సాధించవచ్చు.. : రంగనాథ శర్మ

మండల టాపర్ గా లిటిల్ విద్యార్థి మధునయన శ్రీ.

ఉపాధ్యాయులు, విద్యార్థులను అన్ని రకాల పోటీ పరీక్షలకు సిద్ధం చేయాలి.. :రాజశేఖర్ రెడ్డి.

వెలుగోడు ఫిబ్రవరి 24 రిపబ్లిక్ న్యూస్ : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఎంతటి లక్ష్యాన్ని అయినా సాధించవచ్చు అని రిటైర్డ్ ప్రిన్సిపల్ రంగనాథ్ శర్మ అన్నారు. సోమవారం నాడు వెలుగోడు స్టూడెంట్స్ ఎడ్యుకేషన్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జి బివం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ విశ్రాంత ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ రెడ్డి సతీమణి రాములమ్మ జ్ఞాపకార్థం వెలుగోడు పట్టణ జిల్లా పరిషత్ పాఠశాలలో మండల స్థాయి లో పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు.మండలంలోని వెలుగోడు, రేగడగూడూరు, వేల్పనూరు జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలు, మోడల్ స్కూల్, లిటిల్ ఏంజిల్స్, తెరిసా, జి బి ఎం ,డి పాల్ పాఠశా లకు చెందిన తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియంల నుండి 187 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు నేటి పోటీ ప్రపంచంలో జరిగే అన్ని రకాల కాంపిటేటివ్(పోటీ పరీక్షలకు) సిద్ధం చేయాలని వారు కోరారు. అదే సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తన పిల్లల చదువు లపై దృష్టి సారించాలన్నారు. పట్టణాలలో ఉండే విద్యార్థుల కన్నా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థుల లో పట్టుదల ఎక్కువగా ఉంటుందన్నారు.అటువంటి విద్యార్థులకు సరైన దశ, దిశ ను నిర్దేశిస్తే, వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు.ఇంగ్లీష్ మీడియంలో ప్రథమ స్థానంలో నిలిచిన లిటిల్ ఏంజిల్ విద్యార్థి మధు నయన శ్రీ కి 3000 , ద్వితీయ స్థానం నిలిచిన జి బి ఎం పాఠశాల విద్యార్థి దేవి శరణ్య 2000 తృతీయ స్థానంలో నిలిచిన జిబిఎం పాఠశాల విద్యార్థి వి భరత్ 1000 రూపాయలునగదు బహుమతులను చంద్రశేఖర్ రెడ్డి తన సతీమణి రాములమ్మ జ్ఞాపకార్థంగా అతిథుల చేతుల మీదుగా అందించారు. తెలుగు మీడియం లో ప్రథమ స్థానంలో నిలిచిన వెలుగోడు జిల్లా పరిషత్ విద్యార్థులు ఎస్కే పరసమ్మ కు 3000 , ద్వితీయ స్థానం లో నిలిచిన సుదర్శన్ 2000 , తృతీయ స్థానం నిలిచిన వి దినేష్ కు 1000 రూపాయలు నగదు బహుమతులను విశ్రాంత ప్రిన్సిపల్ రంగనాథ శర్మ అందించారు.ఉర్దూ మీడియం లో ప్రథమ స్థానంలో నిలిచిన వెలుగోడు జిల్లా పరిషత్ విద్యార్థి షేక్ చాందిని కి మూడువేల రూపాయలు కే ఫయాజ్ అలీ ఖాన్ వారి తండ్రి కే దావూద్ అలీ ఖాన్ జ్ఞాపకార్థంగా ,ద్వితీయ స్థానంలో నిలిచిన రేగడగూడూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి ఆలియా కి 2000 రూపాయలను ఖలీల్ ఖాన్ వారి తండ్రి యూసుఫ్ ఖాన్ జ్ఞాపకార్థం, మూడో స్థానం నిలిచిన వెలుగోడు విద్యార్థి హర్షియా కు వేయి రూపాయలు జే సుల్తాన్ వారి తండ్రి టీచర్ అహ్మద్ హుస్సేన్ జ్ఞాపకార్థం నగదు బహుమతిని అందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ హెగ్డే జి.బి.ఎం పాఠశాల కరస్పాండెంట్ విశ్రాంత ఉపాధ్యాయులు మండ్ల చంద్రశేఖర్ రెడ్డి, లిటిల్ ఏంజిల్స్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎంఎఫ్ ఇమ్మానియేల్, ఉపాధ్యాయులు మక్బుల్ ,ఫకీర్ అహ్మద్ ,అనిల్, కరుణ్య కరస్పాండెంట్ దర్గయ్య, నూరుల్ అమిన్ ,మొయినుద్దీన్, నరసింహులు, ఎం ఎం డి ఫైజుల్, అహ్మద్ హుస్సేన్, విశ్రాంత హెడ్మాస్టర్ లు రంగారెడ్డి, నాగిరెడ్డి, సి రాజశేఖర్ రెడ్డి, రవీంద్ర గౌడ్ పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు సుల్తాన్ మోహిద్దిన్ నసురుల్లా ఖాన్, శ్రీనివాసులు, పాఠశాల కమిటీ చైర్మన్ ఖాదర్ భాష తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు .

రెండేళ్లు పూర్తి చేసుకున్న రాష్ట్ర గవర్నర్

వివాద రహితుడుగా జస్టిస్ అబ్దుల్ నజీర్

అమరావతి ఫిబ్రవరి 24 (రిపబ్లిక్ న్యూస్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన గవర్నర్గా విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ రెండేళ్ల ప్రయాణం పూర్తి చేసుకున్నారు. 2023 ఫిబ్రవరి 24న ఆయన ఏపి గవర్నర్గా ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో ఆయన చేత ఆనాటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ఆనాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో పాటు ప్రతిపక్షనేత చంద్రబాబు, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఏపీకి మూడో గవర్నర్‌గా సయ్యద్ అబ్దుల్ నజీర్ బాధ్యతలు చేపట్టారు. కర్ణాటకకు చెందిన అబ్దుల్ నజీర్.. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేయకుండానే.. దేశ అత్యున్నత న్యాయస్థానానికి ప్రమోట్ అయిన మూడో న్యాయమూర్తిగా నజీర్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. 2023 జనవరిలో పదవీ విరమణ చేసిన ఆయన నెలరోజుల వ్యవధిలోనే ఒక రాష్ట్ర గవర్నర్ గా ప్రమాణ స్వీకారం చేయటం విశేషం. ఆనాటి ఏపి గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ స్థానంలో జస్టిస్ అబ్దుల్ నజీర్ నియమితులయ్యారు. అప్పటి వరకు రాష్ట్ర గవర్నర్‌గా కొనసాగిన బిశ్వ భూషణ్ హరిచందన్ ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా నియమితులు కావడంతో నజీర్ ప్రమాణం చేశారు. గత రెండేళ్లుగా నజీ÷ వివాద రహితుడిగా పేరు సంపాదించుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఏనాడూ తలదూర్చలేదు. అనేక రాష్ట్రాల్లో గవర్నర్లపై విమర్శలు వస్తున్న క్రమంలో ఇక్కడ మాత్రం నజీర్ ప్రశాంతంగా ఉంటూ...తన విధుల్లో నిమగ్నమయ్యారు. 1958 జనవరి 5న కర్ణాటకలోని బెలువాయిలో జన్మించిన అబ్దుల్ నజీర్.. మంగళూరులో న్యాయవిద్యను అభ్యసించారు. 1983లో కర్ణాటక ఉన్నత న్యాయస్థానంలో అడ్వకేట్ గా ప్రాక్టీస్ మొదలు పెట్టారు. 2003 మే నెలలో కర్ణాటక హైకోర్టు అడిషనల్ న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆ తర్వాత అదే హైకోర్టులో పర్మినెంట్ న్యాయమూర్తిగా అవకాశం చేజిక్కించుకున్నారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తూనే 2017 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు పదోన్నతి లభించింది. అలా సుప్రీంలో పదవీవిరమణ పొందాక నేరుగా ఏపి గవర్నర్‌గా నియమితులయ్యారు. రెండేళ్లు పూర్తి చేసుకున్న గవర్నర్ నజీ÷కు సిఎం చంద్రబాబు సహా అంతా అభినందనలు తెలిపారు.

జనసేన పార్టీ ఆధ్వర్యంలో మందులు పంపిణి

నంద్యాల ఫిబ్రవరి 24 (రిపబ్లిక్ న్యూస్) :మహా శివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని జనసేన పార్టీ తరపున సెవెన్ హిల్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహిస్తున్న వైద్య శిబిరానికి ఔషధాలను విరాళంగా అందజేసినట్లు సెవెన్ హిల్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ భాగస్వామి జనసేన నాయకులు సుధా మోహన్ రెడ్డి , సుధాకర్ గ్రొన్నారు. జనసేన పార్టీ సమాజసేవ, ప్రజా సంక్షేమం లక్ష్యంగా ముందుకు సాగుతున్న సందర్భంలో, ఈ వైద్య సేవా కార్యక్రమం ప్రజా ఆరోగ్య సంరక్షణకు ఎంతో తోడ్పడుతుందని జనసేన నాయకులు పిడతల సుధాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి, కమిటీ సభ్యులు ఉస్మాన్ బాషా,జనసేన కార్యకర్తలు వెంకటేష్ ,సందీప్,మహేష్, విడ్మెట్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కలెక్టర్ కలిసిన పాణ్యం మాజి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 24 (రిపబ్లిక్ న్యూస్) ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గం పరిధిలోని ఓర్వకల్ మండలం పాలకొలను గ్రామంలో ప్రభుత్వ భూమి ఇళ్ల స్థలాలకు అనువైన ప్రభుత్వ భూమి ఆక్రమణ చేస్తే క్రిమినల్ కేసులుపెడతాం అని బోర్డు పెట్టడం జరిగింది.. కూటమి ప్రభుత్వం వచ్చాక బోర్డును పక్కకు తీసేశారు పలుమార్లు అధికారుల దృష్టికి వెళ్లిన చర్యలు శూన్యం..ఒకవైపు %ణ=ణూ% మరోవైపు గ్రోన్ కంపెనీ ఉన్న కాస్త భూమి భవిష్యత్తు అవసరాల కోసం 320 ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన వారికి స్థలాలు చూపి చట్ట ప్రకారం కాళీ చేయించి, సాగు ద్వారా వచ్చిన మూలధనం పంచాయతీ ఖాతాలో వేయమని కోరడం జరిగింది.. ఆక్రమణలు తొలగించి చట్టం అందరికీ ఒకేలా పనిచేసేలా చూడాలని కర్నూలు జిల్లా కలెక్టర్ వినతిపత్రం అందజేయడం జరిగింది. అనంతరం కల్లూరు మండలం మార్పాపురం గ్రామంలో రేషన్ పంపిణీ టీడీపి నాయకుడు రామాంజనేయులు తన నివాసంలో రేషన్ పంపిణీ చేస్తున్నాడు.. ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు... బదులుగా సచివాలయం వంటి బహిరంగ ప్రదేశాల్లో లేదా మరేదైనా సాధారణ ప్రదేశాల్లో రేషన్ పంపిణీ చేయాలని కర్నూలు జిల్లా కలెక్టర్ వినతిపత్రం అందజేసిన వైఎస్ఆర్పి నంద్యాల జిల్లా అధ్యక్షులు మరియు పాణ్యం మాజి ఎమ్మెల్యే శ్రీ కాటసాని రాంభూపాల్ రెడ్డి ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మీదివేముల ప్రభాకర్ రెడ్డి మరియు కర్నూల్ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ పాలకొలను రమేష్ పాల్గొన్నారు...

వీర మహిళ కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ బైరెడ్డి శబరి

కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 24 (రిపబ్లిక్ న్యూస్): కర్నూలు జనసేన రాష్ట్ర మహిళా సాధికార చైర్మన్ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్చార్జి రేఖాగౌడ్ కుటుంబాన్ని నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి పరామర్శించారు. ఇటీవల రేఖ గౌడ్ మాతృమూర్తి శశికళ గౌడ్ అకాలంగా మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి కర్నూల్ లోని రేఖ గౌడ్ నివాసం లో శశికళ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రగాఢ సానుభూతి తెలిపే వారికి పరామర్శించి ధైర్యం చెప్పారు.ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయ నాగేశ్వర్ రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారితో పాటు జనసేన పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా కన్వీనర్ చింత గజేసాగింపు సురేష్,జనసేన నాయకులు షేక్ హర్షద్, రాంబాబు, రాజశేఖర్, ఎంపీ. చంద్రమౌళి పాల్గొన్నారు.

మీరు 11 మంది వచ్చింది 11 నిమిషాల కోసమా?

జనాలు ఛీ కొడుతున్నా జగన్ తీరు మారడం లేదంటూ ఘాటు వ్యాఖ్యలు

ప్రజా సమస్యల కన్నా మీకు ప్రతిపక్ష హోదానే ముఖ్యమా? అని నిలదీసిన షర్మిల

సభ్యత్వాలు రద్దవుతాయనే భయంతో హాజరు కోసం వచ్చారా? అని మండిపాటు

అమరావతి ఫిబ్రవరి 24 (రిపబ్లిక్ న్యూస్): వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల మరోసారి తీవ్ర విమర్శలతో విరుచుకుపడ్డారు. ఏపీ అసెంబ్లీలో జగన్, వైసీపీ సభ్యుల తీరును తప్పుబడుతూ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఆమె నిలదీశారు. జనాలు ఛీ కొడుతున్నా జగన్ తీరు మాత్రం మారడం లేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. మీరు 11 మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చింది 11 నిమిషాలు ఉండటానికా? అని ప్రశ్నించారు. ప్రజా సమస్యల కన్నా మీకు ప్రతిపక్ష హోదానే ముఖ్యమా అని నిలదీశారు. సభ్యత్వాలు రద్దవుతాయనే భయంతో హాజరు కోసం వచ్చారా? కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడానికి మీకు ప్రతిపక్ష హోదానే కావాలా ? అంటూ వరుస ప్రశ్నలు సంధించారు.అలాగే గవర్నర్ ప్రసంగంపై కూడా షర్మిల విమర్శలు గుప్పించారు. ఆయన ప్రసంగంలో పసలేదని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలు కోసం ఎదురుచూస్తున్న రాష్ట్ర ప్రజలకు గవర్నర్ ప్రసంగం తీవ్ర నిరాశను మిగిల్చిందని ఆమె దుయ్యబట్టారు.

ఊర మాస్ పోలీస్‌గా నాని!

'హిట్-3' టీజర్ విడుదల..

నేచురల్ స్టార్ నాని పుట్టినరోజు సందర్భంగా ఆయన హీరోగా నటిస్తున్న కొత్త సినిమా హిట్–3 టీజర్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. నాని సరసన శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ క్రైమ్ థ్రిల్లర్ మే 1న విడుదల కానుంది. తాజాగా విడుదలైన టీజర్‌లో ఊహించని షాకులు బోలెడిచ్చారు. శ్రీనగర్ నేపథ్యంలో ఈ కథ ఉంటుందని టీజర్ చూస్తే తెలుస్తోంది. అక్కడ జరిగే వరుస హత్యలు.. పోలీస్ ఆఫీసర్ అర్జున్ సర్కార్ వాటిని ఎలా ఛేదించాడు అనే కోణంలో ఈ సినిమా ఉండనుంది. ఊర మాస్ పోలీస్ గా నాని భయంకరంగా ఉన్నాడు. రావు రమేశ్ లాంటి ఒకరిద్దరిని తప్ప ఇతర పాత్రధారులను రివీల్ చేయకుండా టీజర్ కట్ చేశారు. మిక్కీ జె మేయర్ బీజీఎం మరో స్థాయిలో ఉంది. మొత్తానికి 'హిట్ 3 ది థర్డ్ కేస్' ఆషామాషీగా ఉండదని మాత్రం అర్థమైపోయింది. ఇంతకుముందు నాని నటించిన 'దసరా' సినిమా కంటే చాలా తక్కువనిపించే స్థాయిలో 'హిట్ 3' విజువల్స్ ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్నాయి. 'హిట్' యూనివర్స్‌లో భాగంగా దర్శకుడు శైలేశ్ కొలను మరోసారి మోస్ట్ వయొలెంట్ కథతో వస్తున్నారు.

'హరిహర వీరమల్లు' రెండో పాట మనసులు 'కొల్లగొట్టడం' పక్కా!

పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా క్రిష్ జాగర్లమూడి, జ్యోతి కృష్ణ సంయుక్తంగా తెరకెక్కిస్తోన్న భారీ చిత్రం 'హరిహర వీరమల్లు'. ఇప్పటికే ఈ సినిమా నుంచి గ్లింప్స్, ఒక సాంగ్ రిలీజ్ చేయగా ఈరోజు రెండో పాటను విడుదల చేశారు. 'కొల్లగొట్టినాదిరో' అంటూ సాగే పాటను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. కోర కోర మీసాలతో కొదమ కొదమ అడుగులతో... అంటూ వీరమల్లుని పొగుడుతూ సాగింది ఈ పాట. మంచి మాస్ బీట్ తో సాంగ్ అదిరిపోయింది. ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి అందించిన బాణీలకు చంద్రబోస్ సాహిత్యం అందించారు. మంగ్లీ, రాహుల్ సిప్లిగంజ్, రమ్య బెహరా, యామిని ఘంటసాల ఈ పాటను ఆలపించారు. ఏఎం రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఏ.దయాకర్ రావు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో పవన్ సరసన కథానాయికగా నిధి అగర్వాల్ నటిస్తున్నారు. పవన్ చారిత్రాత్మక యోధుడిగా నటిస్తున్న ఈ సినిమాలో బాబీ డియోల్, నర్గీస్ ఫక్రీ, నోరా ఫతేహి లాంటి బాలీవుడ్ స్టార్స్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కాగా, 'హరిహర వీరమల్లు' చిత్రానికి అత్యధిక భాగం క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించిన విషయం తెలిసిందే. ఇంకా చిత్రీకరణ మిగిలుండగానే క్రిష్ ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారు. దాంతో ఆయన స్థానంలో ఈ చిత్ర నిర్మాత ఏఎం రత్నం తనయుడు జ్యోతికృష్ణ దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. 'హరిహర వీరమల్లు' చిత్రం మార్చి 28న వరల్డ్ వైడ్ గా థియేటర్లలో సందడి చేయనుంది.

అనుపమ ఫ్యాన్స్ అప్సెట్ లో?

మలయాళ భామ మలయాళ భామ అనుపమ పరమేశ్వరన్ టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ క్రేజ్ తెచ్చుకోవాల్సిన రేంజ్ ఉన్నా కూడా ఆమె ఆ రేంజ్ లో వెళ్లలేకపోయింది. చేస్తున్న సినిమాలు కూడా ఆమె స్థాయికి తగినవి కాదని కూడా ఆమె ఫ్యాన్స్ ఫీలవుతున్నారు. అనుపమ కెరీర్ స్టార్టింగ్ లోనే మంచి సినిమాలు చేసింది. అంతేకాదు అప్పట్లో కాస్త బొద్దుగా కనిపించిన అమ్మడు ఆడియన్స్ ని ఆకట్టుకుంది. ఐతే స్లిమ్ గా అవ్వాలన్నది తన ఆలోచనో లేదా ఎవరైనా సలహా ఇచ్చారో కానీ అమ్మడు ఎప్పుడైతే స్లిమ్ గా మారిందో ఆమెకు ఛాన్స్ లు కూడా కరువయ్యాయి. ఆశించిన పాత్రలు రాక చేసేది ఏమి లేక వచ్చిన సినిమాలనే చేస్తుంది అనుపమ. తెలుగులో రవితేజ లాంటి స్టార్స్ తో ఛాన్స్ అందుకున్నా లక్ కలిసి రాలేదు. ఇక తమిళ్ లో అమ్మడు యువ హీరోల సరసన నటిస్తుంది. లేటెస్ట్ గా ప్రదీప్ రంగనాథన్ తో డ్రాగన్ సినిమాలో నటించింది అనుపమ. అందులో అనుపమ ఫస్ట్ హాఫ్ వరకు హీరోయిన్ గా కనిపించినా సెకండ్ హాఫ్ అది సపోర్టింగ్ రోల్ లా అనిపిస్తుంది. అనుపమతో పాటు ఈ సినిమాలో నటించిన కయదు లోహర్ స్క్రీన్ ని ఎట్రాక్ట్ చేసింది. అనుపమ ఈ పాత్రలో కనిపించి తన ఖాతాలో ఒక సినిమా పడేలా చేసుకుంది కానీ ఆమె ఫ్యాన్స్ మాత్రం ఆమెను ఇలా చూడాలని అనుకోవట్లేదు. ప్రేమం, అ ఆ సినిమాల్లో అనుపమ రేంజ్ వేరని అంటున్నారు. మళ్లీ తన లుక్ మార్చే విషయం పక్కన పెడితే అనుపమ ఇక మీదట ఎంచుకునే పాత్రల్లో అయినా బెటర్ మెంట్ ఉండాలని కోరుతున్నారు. ఐతే ఎలాంటి అవకాశాలు లేని టైం లో వచ్చిన ఏ ఛాన్స్ అయినా చేయాలని అనిపిస్తుంది. ఐతే అనుపమ తన ఫ్యాన్స్ అందరు తనని క్లాస్ గా ఉండాలని కోరుతుంటే అమ్మడు మాత్రం అసలు వాటిని పట్టించుకోకుండా వచ్చిన పాత్రలను చేస్తుంది. అనుపమ లో ఈ మార్పు ఆమె కెరీర్ కు ప్లస్ అవుతుందో లేదో చూడాలి. డ్రాగన్ సినిమా సక్సెస్ అయినా అనుపమ ఫ్యాన్స్ మాత్రం అప్సెట్ లో ఉన్నారు. మరి ఇక మీదట అయిన అనుపమ తన ఫ్యాన్స్ గురించి కాస్త పట్టించుకుంటే బాగుంటుందని అనిపిస్తుంది.

మైత్రీతో చేతులు కలిపిన ప్రదీప్!

మైత్రి మూవీ మేకర్స్ ప్రస్తుతం టాలీవుడ్ లోనే అగ్ర నిర్మాణ సంస్థ గా పేరు సంపాదించుకుంది. మహేష్ బాబు హీరోగా వచ్చిన శ్రీమంతుడు మూవీతో ఇండస్ట్రీకి పరిచయమైన మైత్రి నిర్మాతలు అతి తక్కువ కాలంలోనే మంచి అభిరుచి ఉందని నిరూపించుకున్నారు. మైత్రి నుంచి సినిమా వస్తుందంటే అందరి దృష్టి ఆ సినిమాపైనే ఉండే స్థాయికి ఆ నిర్మాణ సంస్థ ఎదిగింది. దాదాపు టాలీవుడ్ లోని అగ్ర హీరోలందరితో సినిమాలు చేసిన మైత్రి మూవీ మేకర్స్ ఇటీవలే పుష్ప2 తో భారీ బ్లాక్ బస్టర్ ను అందుకుంది. పుష్ప2 తర్వాత మైత్రీ స్థాయి మరింత పెరిగిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. కేవలం తెలుగులోనే కాకుండా తమిళ, హిందీ భాషల్లో కూడా మైత్రీ సంస్థ సినిమాలను నిర్మిస్తుంది. ఇందులో భాగంగానే మైత్రీ సంస్థ ఓ బైలింగువల్ సినిమాను ప్లాన్ చేసినట్టు తెలుస్తోంది. లవ్ టుడే, డ్రాగన్ సినిమాలతో మంచి హిట్లు అందుకున్న ప్రదీప్ రంగనాథన్ హీరోగా మైత్రీ మూవీ మేకర్స్ ఓ సినిమా చేయనుందని మొన్నీ మధ్య వార్తలొచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడా విషయాన్ని డ్రాగన్ ప్రమోషన్స్ లో భాగంగా స్వయంగా ప్రదీపే వెల్లడించాడు. ఓ కొత్త దర్శకుడు ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నట్టు ప్రదీప్ తెలిపాడు. ఇప్పటికే 20 రోజుల షూటింగ్ కూడా పూర్తి చేసుకున్న ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో రూపొందనుంది. ఈ కథ చాలా బాగా వచ్చిందని, త్వరలోనే అఫీషియల్ గా ఈ ప్రాజెక్టు అనౌన్స్ కానుందని తెలుస్తోంది. ఇదిలా ఉంటే మైత్రీ ఇప్పటికే తమిళంలో అజిత్ తో గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాను తీస్తుండగా, హిందీలో సన్నీ డియోల్ తో జాత్ ను నిర్మిస్తోంది. పాన్ ఇండియా హీరో, పాన్ ఇండియా డైరెక్టర్ లాగా మైత్రీ మూవీ మేకర్స్ తమ బ్యానర్ ను పాన్ ఇండియా స్థాయిలో నిలబెట్టాలనే ధ్యేయంతోనే ఇలా అన్ని భాషల్లో సినిమాలను చేస్తున్నట్టున్నారు నిర్మాతలు.

స్వీటీ అనుష్క స్టన్నింగ్ మేకోవర్

స్వీటీ శెట్టి అలియాస్ అనుష్క శెట్టి పరిచయం అవసరం లేదు. అరుంధతి, భాగమతి, బాహుబలి 1, 2 చిత్రాల్లో అద్భుత నటనతో ఆకట్టుకున్న అనుష్కకు బాషతో సంబంధం లేకుండా అన్నిచోట్లా అభిమానులు ఉన్నారు. ఈ బ్యూటీ చివరిగా మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టిఅనే చిత్రంలో నటించింది. ఆ తర్వాత ఘాటి అనే థ్రిల్లర్ చిత్రంలోను నటిస్తూ బిజీగా ఉంది. ఇటీవలే విడుదలైన ఘాటి గ్లింప్స్ ఆకట్టుకుంది. ఇందులో ఊచ కోత కోసే అందమైన పల్లెటూరి అమ్మాయిగా అనుష్క నటిస్తోంది. అనుష్క గిరిజన యువతిగా నటించింది. శత్రువుల పీకలు కోసేంత ధైర్యవంతురాలైన యువతిగా అనుష్క నటిస్తోందని పోస్టర్లు టీజర్ వెల్లడించాయి. ఘాటి చిత్రంలో మునుపటిలా స్మార్ట్ లుక్ తో కనిపిస్తోంది. అదే రూపంతో ఇప్పుడు అనుష్క ఫోటోషూట్లు ఇంటర్నెట్ లో వైరల్ అవుతున్నాయి. తాజాగా అనుష్క సరికొత్త మేకోవర్ కి సంబంధించిన ఫోటోలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో స్వీటీ శెట్టి ఎంతో సింపుల్ గా కనిపిస్తున్నా యూత్ హృదయాల్లో గిలిగింతలు పెడుతోంది. జేజమ్మ ఎంతో ముచ్చటగా కనిపిస్తోంది. సింపుల్ పంజాబీ దుస్తుల్లో అందమైన ఎక్స్ ప్రెషన్స్, స్మైలీ లుక్ తో అందరి దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా స్వీటీ ఫేస్ లో నవ్వు, ఆ నుదిటిన తిలకం బొట్టుతో ఎంతో బ్యూటిఫుల్ గా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ కొత్త లుక్ యూత్ సామాజిక మాధ్యమాల్లోకి దూసుకెళుతోంది.

యూసఫ్ గూడలో ముమైత్ ఖాన్ అకాడమీ...

'ఇప్పటికింకా నా వయస్సు నిండా పదహారే' అంటూ ఐటమ్ సాంగ్‌కు స్టెప్పులేసి యువతను ఉర్రూతలూగించిన ముమైత్ ఖాన్ గురించి సినీ ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. సినిమాల్లో పలు పాత్రల్లో కూడా నటించి టాలీవుడ్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న ముమైత్ ఖాన్ కొంతకాలంగా సినిమాలకు దూరంగా వున్నారు.

చాలా రోజుల తర్వాత ఇప్పుడు మరో రంగంలో అడుగుపెడుతూ ఆమె మీడియా ముందుకు వచ్చారు. వీలైక్ మేకప్ అండ్ హెయిర్ అకాడమి డైరెక్టర్‌గా బ్యూటీ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ రంగంలోకి అడుగుపెట్టారు. తాజాగా ఈ సంస్థ హైదరాబాద్ యూసుఫ్ గూడలో తన బ్రాంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముమైత్ ఖాన్ మాట్లాడుతూ.. బ్యూటీ పరిశ్రమపై మక్కువ ఉన్న వారిని ప్రోత్సహించేందుకు ఈ సంస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ రంగంపై అవగాహన కల్పించడంతో పాటు బ్రైడల్ అండ్ హెయిర్ మేకప్ లో శిక్షణ ఇవ్వబోతున్నామని, విద్యార్థులను ప్రపంచ స్థాయిలో ట్రైయిన్డ్ స్పెషలిస్ట్‌లుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ముమైత్ ఖాన్ తెలిపారు. తమ సంస్థ బ్రైడల్, మేకప్, హెయిర్ స్టైలింగ్‌తో పాటు కాస్మోటాలజీ, స్కిన్ కేర్, వెల్‌నెస్‌లో నైపుణ్యం పెంచేందుకు కృషి చేయబోతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ కో ఫౌండర్ కెయిత్ జావెద్, ఆర్టిస్టులు జ్యోతి, అక్సా ఖాన్, సింగర్ రోల్ రైడా, డాన్స్ మాస్టర్ జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

పి4, ఎంఎస్ఎంఈ, మిస్సింగ్ హౌస్ హోల్డ్ డేటా సర్వేలను వేగవంతంగా పూర్తిచేయండి

పిజిఆర్ఎస్ కార్యక్రమంలో 168 దరఖాస్తులు -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

సున్నిపెంట/నంద్యాల, ఫిబ్రవరి 24, రిపబ్లిక్ న్యూస్:- ప్రజా సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం సున్నిపెంటలోని తాసిల్దార్ కార్యాలయం నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతతో పరిష్కరించాలన్నారు. స్వీకరించిన ప్రతి అర్జీని అధికారులు చదివి అధికారి లాగిన్ లో తప్పనిసరిగా ఆమోదించడంతో పాటు విథిన్ ఎస్ఎల్ఎలోగా నాణ్యతతో పరిష్కరించాలని తెలిపారు. రీ ఓపెన్ అయిన దరఖాస్తులను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పూర్తి చేయాలని సూచించారు. సీఎమ్ఓ కార్యాలయము,

ఉప ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖుల నుంచి వచ్చిన అర్జీలకు అధికారులు ప్రాధాన్యత ఇస్తూ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కింది స్థాయి అధికారులు పరిష్కరించిన అర్జీలకు సంబంధించిన ఎండార్స్మెంట్లను జిల్లా స్థాయి అధికారులు చదివి సమస్యలను ఏవిధంగా పరిష్కరిస్తున్నారో తెలుసుకొని ఆడిట్ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు.

గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పి4 సర్వే, మిస్సింగ్ హౌస్ హెూల్డ్ డేటా, ఎంఎస్ ఎంఈ సర్వే, చిల్డ్రన్ ఆధార్ అప్డేట్ లను మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని పారామీటర్లలో బనగానపల్లి, బేతంచెర్ల, సిరివెళ్ల మండలాలు వెనుకబడి ఉన్నాయని ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పెండింగ్లో ఉన్న సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పిజిఆర్ఎస్ కార్యక్రమంలో 168 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు సమర్పించారు. ఈ సమస్యలన్నీ నిర్ణీత కాల పరిమితులలోగా పరిష్కరించాలని ఎండార్స్ చేస్తూ కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

గవర్నర్ పర్యటన భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన

నంద్యాల జిల్లా ఇన్చార్జ్ ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్



నంద్యాల క్రైం, ప్రతినిధి ఫిబ్రవరి24(రిపబ్లిక్ న్యూస్) రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ నేడు సాయంత్రం నంద్యాల జిల్లా, శ్రీశైలం దేవస్థానంకు రాక సందర్భంగా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ తో కలిసి నంద్యాల జిల్లా ఇన్చార్జ్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ సున్నిపెంట హెలీప్యాడ్ వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం స్పెషల్ పార్టీ పోలీసులకు తగు సూచనలు చేశారు. అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, శ్రీశైలం సీఐ జి.ప్రసాదరావు తదితరులున్నారు.

కాలినడకన వచ్చి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకున్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.

నంద్యాల, ఫిబ్రవరి 24, రిపబ్లిక్ న్యూస్ :నల్లమల అరణ్యంలో సుమారు 40 కిలోమీటర్ల దూరం కాలినడకన సోమవారం ఉదయం శ్రీశైలం చేరుకున్న నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆత్మకూరు మండలం వెంకటాపురం మీదుగా అభయారణ్యంలో పాదయాత్రతో బైర్లూటి, నాగలూటి, నెక్కంటి పెచ్చెరువు భీముని కొలను కైలాస ద్వారం మీదుగా రెండు రోజుల పాదయాత్రతో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీశైలం చేరుకొని ముందుగా సాక్షి గణపతి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం సోమవారం శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి ఆలయ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు సాదర స్వాగతం పలికారు. వేద పండితులు, అర్చకులు ఆశీర్వచనం పలికి శేష వస్త్రంతో సన్మానం చేసి, తీర్థ ప్రసాదం అందించారు. ఎంపీ వెంట దేవస్థానం పిఆర్ఓ శ్రీనివాసరావు, ఎంపీ బైరెడ్డి శబరి చెల్లెలు బైరెడ్డి శర్వాణి, తదితర కుటుంబ సభ్యులు, టీడీపీ నాయకులు ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేసే వారి మీద కఠిన చర్యలు తీసుకుంటాం

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు , ప్రతినిధి ఫిబ్రవరి 24(రిపబ్లిక్ న్యూస్) ఇసుక అక్రమ రవాణా చేసే వారి మీద కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష తెలిపారు.సోమవారం సాయంకాలం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో డిస్ట్రిక్ట్ లెవెల్ శాండ్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు..

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యుల ఆదేశాల ప్రకారం ఉచిత ఇసుక ను సాధారణ ప్రజల గృహ నిర్మాణాల అవసరాలకు అనుమతి ఇవ్వాలని వారిని ఎటువంటి ఇబ్బందులకు గురి చేయకూడదని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్రమంగా ఇసుక వ్యాపారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో ఎవరైనా అక్రమంగా ఇసుకను సేకరించుకొని వ్యాపారం చేస్తున్న , సరిహద్దులు దాటిస్తున్న వారి వాహనాలను వెంటనే సీజ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మండల , గ్రామ సెక్రటేరియట్ అధికారుల తో ఏర్పాటు చేయబడిన టీంల సహాయంతో మెరుపు దాడులు నిర్వహించి అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. డివిజన్ స్థాయి సమావేశాలను నిర్వహించుకొని ఎక్కడైనా ఇసుక అక్రమ రవాణా జరుగుతూ ఉంటే కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు ఆర్డీవో లను ఆదేశించారు.

నదులు, వాగులు దగ్గర ఉన్న త్రాగునీటి సరఫరా కేంద్ర ప్రాంతాల లో ఇసుక త్రవ్వకాలకు ఎటువంటి పరిస్థితుల్లో అనుమతించరాదని కలెక్టర్ ఆదేశించారు. అటువంటి ప్రదేశాల్లో ఇసుక త్రవ్వకాలు జరుగుతూ ఉంటే వాహనాలను సీజ్ చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య , అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా , డి.ఎస్.పి రవీంద్రబాబు , డిఎస్పి ఉష శ్రీ , డిడి మైన్స్ రవిచంద్ర , ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు , డిటిసి శాంత కుమారి , డిపిఓ భాస్కర్ , ఇరిగేషన్ ఈఈ శైలేశ్వర్, గ్రౌండ్ వాటర్ డిడి శ్రీనివాసరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ రెడ్డి , కర్నూలు తాలూకా సిఐ , కోడుమూరు సిఐ, తదితరులు మరియు సబ్ కలెక్టర్ ఆదోని , ఆర్డిఓ లు పత్తికొండ మరియు కర్నూలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

క్రిస్టియన్ల స్వయం ఉపాధికి రాయితీతో కూడిన రుణాలు

రూ. 2.43కోట్లు రాయితీ విడుదల చేసిన ప్రభుత్వం

మైనార్టీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యం

రాష్ట్ర న్యాయ,మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

అమరావతి ఫిబ్రవరి 24 (రిపబ్లిక్ న్యూస్) : రాష్ట్రంలో క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అర్హత కలిగిన లబ్ధిదారులకు అమలు చేస్తున్న స్వయం ఉపాధి పథకాలకు రుణ రాయితీ కింద రూ. 2.43 కోట్లు మొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేసిందని రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సోమవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. 2024-2025 కు ఆర్థిక సంవత్సరానికి గాను క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.4.86 కోట్లు తో స్వయం ఉపాధి ప్రణాళిక అమలు జేయడానికి నిర్ణయించడం జరిగిందన్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.2.43 కోట్లు రాయితీ కింద ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మిగతా రూ.2.43 కోట్లు బ్యాంకుల ద్వారా రుణ రూపంలో పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చడమే లక్ష్యంగా సంక్షేమ, అభివృద్ధి ప్రణాళిక అమలు చేయడం జరుగుతుందని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి పరిష్కారం దిశగా అడుగులు వేస్తా - మంత్రి ఆనం



శ్రీశైలం, 24 ఫిబ్రవరి, రిపబ్లిక్ న్యూస్ : శ్రీశైలం దేవస్థానానికి సంబంధించి అనేక సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న భూ వివాదాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటుందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఎంతో కాలంగా పెండింగ్లో ఉన్న భూమి వివరాలు పరిష్కారం కోసం స్వయంగా మంత్రి నేడు స్థానిక శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు ఈ సమస్యల పరిష్కారానికి అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం దృష్టిలో పెట్టి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన వెల్లడించారు. అలాగే, శ్రీశైలం భవిష్యత్తు అభివృద్ధి దృష్ట్యా మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై కూడా ప్రభుత్వం ప్రత్యేకంగా చర్చలు జరుపుతోందని మంత్రి వివరించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉన్న భూ సమస్యల పరిష్కారం అనంతరం, శ్రీశైలం అభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన మార్గదర్శకాలు రూపొందించనున్నట్లు చెప్పారు. ఈ అంశాలపై సమీక్ష సమావేశంలో శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి, దేవస్థాన ఈవో శ్రీనివాసరావు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, భక్తుల సౌకర్యాన్ని మెరుగుపరిచేలా కీలక నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు.

శ్రీశైలం మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

శ్రీశైలం, ఫిబ్రవరి 24, రిపబ్లిక్ న్యూస్ : శ్రీశైలం పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు అందిస్తున్న సేవలు, ఏర్పాట్లను దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి దగ్గరుండి సమీక్షించారు. శివ భక్తుల క్యూలైన్లోకి వెళ్లి స్వయంగా పరిశీలించిన మంత్రి, భక్తులకు కల్పించిన సదుపాయాలను అడిగి తెలుసుకుని, వారి యోగక్షేమాలను మరింత మెరుగుపరిచేందుకు అధికారులకు సూచనలు అందించారు. ఇప్పటివరకు ఎదురైన చిన్న చిన్న పొరపాట్లు కూడా పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. అదనంగా, భక్తులు ఇరుముడిని విరమించే ప్రదేశాన్ని విస్తరించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేయాలని ఆదేశాలు జారీ చేశారు. శివ భక్తుల కోసం చేపట్టిన మహాశివరాత్రి ప్రత్యేక ఏర్పాట్లను అడుగు అడుగునా పరిశీలించిన మంత్రి, భక్తుల అభిప్రాయాలను స్వీకరించి, మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. భక్తులకు విశేష అనుభూతి కలిగేలా అన్ని ఏర్పాట్లు చేయనున్నట్టు ఆయన హామీ ఇచ్చారు. ఏర్పాట్లు పరిశీలించిన వారిలో మంత్రి ఆనం తో పాటు శ్రీశైలం శాసన సభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఉన్నారు

ఆరవ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

మహానంది, ఫిబ్రవరి 24, (రిపబ్లిక్ న్యూస్): తిమ్మాపురం మోడల్ స్కూల్లో ఆరవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం అయిందని ప్రిన్సిపల్ లక్ష్మణరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఆన్లైన్లో దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. విద్యార్థులు మార్చి 31వ తేదీ నాటికి దరఖాస్తులు చేసుకోవాలని, ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ప్రవేశ అర్హత వివరాలను విడుదల చేశారన్నారు. ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com